# ప్రకాశం జిల్లా అభివృద్ధికి పోరాడండి!

## పాలకులను నిలదీయండి!!

## - సిపియం

**వ్యవసాయంలో వెనుకబాటు - అభివృద్ధిలేని పారిశ్రామిక రంగం**

**ముందుకు సాగని వెలుగొండ, ఇతర ప్రాజెక్టులు**

**అధోగతిలో విద్యారంగం**

**ప్రైవేటు వ్యక్తుల చేతిలో వైద్యరంగం - ప్రజలకు అందని వైద్యం**

**అభివృద్ధికాని మౌలిక సదుపాయాలు - కుంగదీస్తున్న ఫ్లోరిన్ రక్కసి**

**అన్నింట్లో వెనుకబడిన ప్రకాశంజిల్లా.**

# జిల్లా అభివృద్ధికి పోరాడండి - పాలకులను నిలదీయండి

ప్రియమైన ప్రజలారా,

- అభివృద్ధి అంటే పాలకపార్టీల నాయకుల అభివృద్ధి కాదు - ప్రజల అభివృద్ధి.
- అభివృద్ధి అంటే సిమెంటు రోడ్లు, పెద్ద పెద్ద మాల్స్, ప్లైఓవర్లు కాదు. ఉపాధి కల్పించడం, ప్రజల కొనుగోలు శక్తి పెరగడం. జీవన ప్రమాణాలు పెరగడం.
- అధికారపార్టీ, ప్రతిపక్షపార్టీ అందరూ ప్రకాశంజిల్లా వెనుకబడిందంటారు - వెనుకబడి వుండటానికి దోషులెవరు. ఎవరిని నిందించాలి. ప్రతిపక్షంలో వున్నప్పుడు వెనుకబడిందంటారు. అధికారంలోకి వచ్చిన తరువాత వాగ్దానాలతో సరిపుచ్చుతారు. అమలు చేయ్యాల్సింది ఎవరు? ప్రజలే నిర్ణయించాలి.

## జిల్లా సంక్షిప్త సమాచారం

| విషయం | 2011 | 2001 |
|---|---|---|
| జనాభా సంఖ్య | 33,92,764 | 30,59,423 |
| పురుషులు | 17,12,735 | 15,52,332 |
| స్త్రీలు | 16,80,029 | 15,07,091 |
| జనాభా పెరుగుదల శాతం | 10.90 | 10.88 |
| భూ వైశాల్యం (చ.కి.మీ.) | 17,626 | 17,626 |
| జనసాంద్రత (చ.కి.మీటర్కు) | 192 | 174 |
| స్త్రీపురుష నిష్పత్తి (1000కి) | 981 | 971 |
| చిన్నారుల్లో... (0-6 వయసు) | 932 | 955 |

| | | |
|---|---|---|
| అక్షరాస్యతా శాతం | 63.53 | 57.38 |
| పురుషులు | 73.53 | 69.35 |
| స్త్రీలు | 53.40 | 45.08 |
| ఆరేళ్లలోపు వయసు జనాభా | 3,60,461 | 3,89,344 |
| బాలురు | 1,86,581 | 1,99,153 |
| బాలికలు | 1,73,880 | 1,90,191 |
| అక్షరాస్యత | 19,26,495 | 15,32,126 |
| పురుషులు | 11,22,249 | 9,38,482 |
| స్త్రీలు | 8,04,246 | 5,93,644 |
| ఆరేళ్లలోపు చిన్నారులు | 10.62% | 12.73% |
| బాలురు | 10.89% | 12.83% |
| బాలికలు | 10.35% | 12.62% |

- రాష్ట్రం మొత్తంతో పోలిస్తే ప్రకాశం జిల్లా జనాభా 4.01శాతంగా ఉన్నారు.
- జిల్లా మొత్తం విస్తీర్ణం 42,35,572 ఎకరాలుండగా అందులో 10,93,682 ఎకరాలు అటవీ భూములే! సాగుకు యోగ్యమైన భూమి 19,50,000 ఎకరాలుంది.
- జిల్లాలో మూడు రెవెన్యూ డివిజన్లు, 12 అసెంబ్లీ నియోజకవర్గాలు, 56మండలాలు ఉన్నాయి. 1093 గ్రామాలుండగా 1058 రెవెన్యూ గ్రామాలు, 1030 పంచాయతీలున్నాయి. శివారు గ్రామాలు 1318 ఉన్నాయి.
- జిల్లా జనాభాలో షెడ్యూలు కులాల వారు 21.29% , షెడ్యూలు తెగలు 3.9 % ఉన్నారు.
- జిల్లాలో నాలుగు లక్షల మంది రైతులు, ఆరులక్షల మంది వ్యవసాయ కార్మికులు ఉన్నారు.
- జనాభా సంఖ్యతో సరిసమానమైన పశుసంపద కూడా జిల్లాకో పెద్ద వనరు.
- గత 45ఏళ్లలో 28ఆర్థిక సంవత్సరాల్లో జిల్లాలో సాధారణ వర్షపాతంకన్నా తక్కువ వానలు పడ్డాయి.

## గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య వ్యత్యాసం

| విషయం | గ్రామీణ | పట్టణ |
|---|---|---|
| జనాభా | 80.48% | 19.52% |
| జనాభా సంఖ్య | 27,30,648 | 6,62,116 |

| | | |
|---|---|---|
| పురుషులు | 13,81,772 | 3,30,963 |
| స్త్రీలు | 13,48,876 | 3,31,153 |
| లింగ నిష్పత్తి | 976 | 1001 |
| చిన్నారుల్లో లింగ నిష్పత్తి | 929 | 944 |
| ఆరేళ్లలోపు చిన్నారులు | 2,96,805 | 63,656 |
| బాలురు | 1,53,840 | 32,741 |
| బాలికలు | 1,42,965 | 30,915 |
| ఆరేళ్లలోపు చిన్నారుల శాతం | 10.87 | 9.61 |
| బాలురు | 11.13 | 9.89 |
| బాలికలు | 10.60 | 9.34 |
| అక్షరాస్యత | 14,53,489 | 4,73,006 |
| పురుషులు | 8,64,332 | 2,57,917 |
| స్త్రీలు | 5,89,157 | 2,15,089 |
| అక్షరాస్యతా శాతం | 59.72 | 79.04 |
| పురుషులు | 70.39 | 86.48 |
| స్త్రీలు | 48.86 | 71.64 |

**జిల్లాలో నేటికీ అత్యధిక జనాభా గ్రామాల్లోనే నివసిస్తున్నారు. వ్యవసాయం దెబ్బతిని ఉపాధి అవకాశాలు తగ్గడంతో క్రమంగా పట్టణాలకు వలసలు పెరుగుతున్నాయి. పట్టణాల్లోనూ ఉపాధి అవకాశాలు లేకపోవడం, వసతుల లేమి తీవ్ర సమస్యలుగా మారుతున్నాయి.**

## ఇదీ మన పరిస్థితి

45 సం॥రాల క్రితం ఏర్పడిన ప్రకాశంజిల్లా నేటికీ తీవ్రంగా వెనుకబడే వుంది. భూగర్భంలో ఇనప ఖనిజం, గ్రానైట్, బెరైటీస్, మాంగనీసు, యురేనియం, క్వార్ట్జ్, సిలికాన్ మొ॥ వనరులు వున్నాయి. నైపుణ్యం కలిగిన మానవ వనరులూ వున్నాయి. గుండ్లకమ్మ, మూసి, పాలేరు, మన్నేరు నదులు జిల్లాలో గుండా ప్రవహిస్తున్నాయి. సంవత్సరానికి 50 టి.యం.సి.లు సముద్రంలో కలుస్తున్నవి. పొగాకు, పండ్లు, పాలు, పప్పులు మొదలైన వ్యవసాయ ఉత్పత్తులకు మనజిల్లా ప్రసిద్ధి. మనకు 102 కి.మీ తీరప్రాంతం వుంది. చేపల ఉత్పత్తి – ప్రాసెసింగ్‌కు అపార అవకాశాలు వున్నాయి.

కరువు, వలసలు, ఫ్లోరిన్ సమస్యలు తీవ్రంగా వున్నాయి. ఇప్పటికీ జిల్లాలో 19 లక్షలు మాత్రమే అక్షరాస్యులు. మరుగుదొడ్ల సౌకర్యంలేని కుటుంబాలు 70%, కట్టెపుల్లలతో వంటచేసుకొనేవారు 62%, ఒక గది ఇల్లు మాత్రమే వున్నవారు 54%, స్నానాలు చేయడానికి వసతిలేని వారు 38%, తాటాకు ఇళ్ళలో నివశించేవారు 14%. అతితక్కువ ఆదాయం వచ్చే కుటుంబాలు 70% వున్నవి. 4 లక్షల మంది వలసలు పోతేగాని బ్రతకలేని స్థితివుంది. 80% భూమి వర్షాధారంగానే పంటలు పండిస్తున్నారు. ఈ దుస్థితికి కారణం ఎవరు? వెనుకబడి వుండటానికి కారణాలు ఏమిటి? ఎవరు బాధ్యులు? ఎవరిని నిందించాలి? ఇప్పటిదాకా పరిపాలన చేసిన కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల నేతలు కాదా? అధికారంలో వున్నప్పుడు వాగ్దానాలతో సరిపుచ్చుతూ, తమ వ్యక్తిగత ఆస్తులు కూడబెట్టుకునే పనిలో ఉంటున్నారు. ప్రతిపక్షంలో వున్నప్పుడు జిల్లా వెనుకబడిందంటారు. తాత్కాలిక ప్రయోజనాలవైపు ప్రజలను మళ్ళిస్తారు. శాశ్వతప్రయోజనాలను గాలికి వదిలేస్తారు? ఇటువంటి పాలకుల చేతుల్లో జిల్లా అభివృద్ధి సాధ్యమంటారా?

## వనరులున్నాయి - చిత్తశుద్ధే తక్కువ

మూడు జిల్లాల్లోని వెనుకబడిన ప్రాంతాలను కలుపుతూ 1970 ఫిబ్రవరి రెండో తేదీన ప్రకాశం జిల్లా ఏర్పడింది. జిల్లా పరిధిలోని వనరులను సమర్ధవంతంగా వినియోగించుకోవడం ద్వారా అభివృద్ధి సాధించే లక్ష్యంతో జిల్లా ఏర్పడింది. వెనుకబాటును అధిగమించే ధ్యేయంతో నడవాల్సిన పాలకులు తొలిదశలోనే దారితప్పారు. ఫలితంగా వనరులు ధ్వంసమయ్యాయి. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో నల్లమల అడవులు, వెలిగొండ కొండలు పెట్టని కోటలుగా ఉన్నాయి. తూర్పున 102 కిలోమీటర్ల పరిధిలో విశాలమైన సముద్ర తీరం ఉంది. సహజ వనరుల ఖిల్లాగా జిల్లాను చెప్పుకోవచ్చు. గెలాక్సీ గ్రానైట్, పలకలు వంటి ఖనిజ ఉత్పత్తులు జిల్లాకు ఖ్యాతిని తెచ్చాయి. ఇంకా ఐరన్ఓర్, సిలికాన్, బైరటీస్ వంటి ఖనిజాలూ ఉన్నాయి. జిల్లాలో సాధారణ వర్షపాతం 750.9మి.మీ.గా ఉంది. నైరుతీ, ఈశాన్య రుతుపవనాలు రెండూ బలహీనంగామారి జిల్లాను తాకుతాయి. సాధారణ అత్యధిక సగటు ఉష్ణోగ్రత 39.6 డిగ్రీల సెల్సియస్గా ఉంది. జిల్లాలో 41.1శాతం నల్లరేగడి భూములు, 51శాతం ఎర్రరేగడి, ఆరుశాతం ఇసుక నేలలు ఉన్నాయి. నల్లమలలో పుట్టిన గుండ్లకమ్మ నది జిల్లాకో పెద్ద వనరు. మూసీ, పాలేరు నదులూ చెప్పుకోదగ్గవే. ఈ వనరులను ఉపయోగించుకోవడంలో వైఫల్యం ఉంది. జిల్లా ఏర్పడిన 45ఏళ్లలో వనరులను వినియోగించుకుని అభివృద్ధికి ప్రణాళికలు రచించడంలో పాలకులు శ్రద్ధ చూపలేదు. పైగా ఈ వనరులను నాశనం చేసేరీతిలో అభివృద్ధి సాగింది. సముద్రం, అడవులు, ఖనిజ

సంపదలు, ప్రభుత్వభూమి దోపిడీదారుల వశమయ్యాయి. గ్రానైట్ వంటి ఖనిజ సంపదంతా కొందరు వ్యక్తుల ఆస్తులుగా మారాయి. ఇందుకు ప్రభుత్వాలూ చేయూత నిచ్చాయి. చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురయ్యాయి. తీరప్రాంతం లోని ప్రభుత్వ భూములన్నీ రొయ్యల చెరువులుగా, తోటలుగా కొందరు వ్యక్తుల పరమయ్యాయి. ప్రస్తుతం ప్రత్యేకించి వనరుల రక్షణకు పెద్ద ఉద్యమం చేపట్టాల్సిన అవసరంవుంది. వనరులను కాపాడుకుంటేనే జిల్లాకు మనుగడ అంటే అతిశయోక్తి కాదు.

- సముద్రతీర రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి. తీరమంతటా గ్రీన్‌బెల్ట్ ఏర్పాటు చేయాలి.
- నదులను పరిరక్షించి నీటి నిల్వ ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలి. వరద నీటిని నిల్వచేసేలా ప్రణాళిక ఉండాలి.
- అడవుల నరికివేతను నివారించాలి.
- ఖనిజ సంపద నుంచి పూర్తిస్థాయిలో ప్రభుత్వానికి ఆదాయం అందేలా చర్యలు తీసుకోవాలి.
- అడవులు, గనులపై వ్యక్తుల ఆధిపత్యాన్ని నివారించాలి. ప్రభుత్వ పరం చేయాలి.

### అధోగతిలో మౌలిక సదుపాయాలు!

ఎన్ని వనరులున్నా జిల్లాలో మౌలిక సదుపాయాల కల్పనపట్ల పాలకులు నిర్లక్ష్యం ప్రదర్శించారు. జిల్లాలో 117కిలోమీటర్ల జాతీయ రహదారి, 711కిలోమీటర్ల రాష్ట్ర రహదారి, 242కిలోమీటర్ల రైలుమార్గం ఉన్నాయి. కొద్దిమేరకు వాటిని అభివృద్ధి చేయడం తప్ప ప్రణాళికాబద్ధంగా మరిన్ని రహదారులు, రైలుమార్గాలను సాధించలేక పోయాం. సముద్రతీరంలో పోర్టు ఏర్పాటు కలగానే మిగిలింది. గతంలో వాడరేవు, ఇటీవల కాలంలో రామాయపట్నం పోర్టులు జిల్లా ప్రజల్లో ఆశలు రేపాయి. కొద్దికాలానికే వాటిపై ఆశలు ఆవిరయ్యాయి. విశాలమైన సముద్ర తీరాన్ని వినియోగించుకునే ప్రణాళికేదీ పాలకుల వద్ద లేదు. తీరమంతా రొయ్యల చెరువుల మయమైంది. ఎప్పటి నుండో ఊరిస్తున్న నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే మార్గం తాజాగా మరోసారి తెరమీదకు వచ్చింది. ఒంగోలు- దొనకొండ మార్గానికీ సర్వే చేసినా నష్టాల పేరుతో రైల్వే శాఖ దాన్ని వదిలేసింది. నదులపై ప్రాజెక్టుల నిర్మాణమూ నత్తనడకనే సాగింది. సాగరు, కొమ్మమూరు కాలువల పరిధిలో జిల్లాలో చివరి భూములే ఉండటం వలన ఏటేటా రైతులకు తిప్పలు తప్పడం లేదు. ఆ కాలువల ఆధునీకరణ పనులతోనూ జిల్లాకు ఒరిగింది శూన్యమే! వనరుల ఆధారంగా మౌలిక సదుపాయాల కల్పన సాగనందునే జిల్లా అభివృద్ధిలో వెనుకబాటుకు గురయ్యింది. విదేశీమారక ద్రవ్యాన్ని

అందించే గ్రానైట్, రొయ్యలు, పలకలు, చేనేత పరిశ్రమల పరిధిలోనూ రహదారుల నిర్మాణం జరక్కపోవడం గమనార్హం. పండ్లతోటలు, వ్యవసాయ ఉత్పత్తులకు తగిన రీతిలో పరిశ్రమల ఏర్పాటూ సాగలేదు. రైతుల శ్రేయస్సు రీత్యా వాణిజ్య సదుపాయాలనూ పాలకులు కల్పించలేక పోయారు. ఫలితంగా ఏటేటా సమస్యలతో వ్యవసాయ రంగం కుదేలవుతూనే ఉంది. విద్యావైద్య రంగాలపట్ల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. అరకొర సిమెంట్ రోడ్లు, భవన నిర్మాణాలతోనే దశాబ్దాలుగా పాలన సాగుతోంది. అవే తమ ఘనతగా పాలకులు చెప్పుకోవడం మామూలైంది. ప్రజల ఆర్థికాభివృద్ధి దిశగా సదుపాయల కల్పన సాగనంతకాలం జిల్లా అభివృద్ధి మందగమనంలోనే సాగుతుంది. మౌలిక సదుపాయాల కల్పన దిశగా పాలకుల దృష్టిని మళ్లించాలంటే ప్రజా ఉద్యమాల ద్వారానే సాధ్యం.

- సముద్ర తీరంలోని వాడరేవు, రామాయపట్నంలో పోర్టులను నిర్మించాలి. తీరంలోనే జాతీయ రహదారి నిర్మాణాన్ని చేపట్టాలి.
- సాగు, తాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలి.
- నడికుడి– శ్రీకాళహస్తి, ఒంగోలు– దొనకొండ, గిద్దలూరు– బాక్రాపేట రైల్వే లైన్లను ఏర్పాటు చేయాలి.
- జిల్లాలోని సముద్ర, ఖనిజ ఉత్పత్తుల ఎగుమతులకు ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి. పంట ఉత్పత్తులను నేరుగా ప్రభుత్వ కేంద్రాల ద్వారానే కొనుగోళ్లు జరపాలి.
- చీరాల, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి ప్రాంతాలకు రవాణా సదుపాయాలను అభివృద్ధి చేయాలి. ఆయా రోడ్లను విస్తరించాలి.
- ఒంగోలు, దొనకొండ విమానాశ్రయాలను ఏర్పాటు చేయాలి.
- సముద్ర ఉత్పత్తుల ప్రాసెసింగ్, ఉప్పు, ఇనుక ఖనిజం, పవర్ ప్లాంట్స్, పంటలు, తోటల ఉత్పత్తుల ఆధారంగా పరిశ్రమల ఏర్పాటుకు పూనుకోవాలి.
- పరిశ్రమల ఏర్పాటుకు బంజరు, ప్రభుత్వ భూములనే వినియోగించాలి. భూసేకరణ పేరుతో పంట భూముల సేకరణ నిలిపివేయాలి.

## నిరాదరణకు గురైన మన వ్యవసాయ రంగం

జిల్లాలో సాగుకు యోగ్యమైన భూమి 19.5 లక్షల ఎకరాలు వున్నది. సాగు అవుతుంది 14 లక్షల ఎకరాలు మాత్రమే. జిల్లాలో ప్రధానంగా వర్షాధారంమీద ఆధారపడి సాగుచేస్తున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం 5.1 లక్షల ఎకరాలకు నీటి వనరులు వున్నాయి. కాని 3 లక్షల ఎకరాలకు మించి సాగునీరు అందడంలేదు. అంటే 21% సాగుభూమికి

మాత్రమే నీరు అందుతుంది. అదికూడా మాగాణి, ఆరుతడులకలిపి 11 లక్షల ఎకరాల భూమి వర్షాధారంమీదనే ఆధారపడి పంటలు పండిస్తున్నారు.

**సాగరుజలాల్లో మన జిల్లాకు అన్యాయం :** సాగరు కుడికాలువ ద్వారా 4.42 లక్షల ఎకరాలకు సాగునీరు అందాలి. అందుతుంది 2013లో 1.60 వేల ఎకరాలకు మాత్రమే. మన జిల్లాకు రావాల్సిన వాటా 75 టి.ఎం.సిలు. కాని 25 టి.ఎం.సిల నీరు కూడా రావడంలేదు. అందువలన కాలువ చివర భూములకు నీరు అందడంలేదు. కొమ్మమూరు కాలువద్వారా కృష్ణాడెల్టాకు 75,000 ఎకరాలకు సాగునీరు అందించాలి. కాని 30,000 ఎకరాలకు మించి అందడంలేదు. మార్కాపురం ప్రాంతంలో 132 చెరువుల క్రింద 43,000 ఎకరాలు, కనిగిరి ప్రాంతంలో 120 చెరువుల ద్వారా 12,000 ఎకరాలు ఆయకట్టువున్నది. రాళ్ళపాడు రిజర్వాయరు క్రింద వర్షం వస్తేనే పంటలు పండుతున్నవి. లేకపోతేలేదు. 355 లిఫ్ట ఇరిగేషన్ స్కీములలో 182 స్కీములు పనికిరానివిగా తేల్చినారు. మిగిలినవి 173 పథకాల ద్వారా 0.89 లక్షలల ఎకరాలు మాత్రమే నీరందుతుంది.

**పంటలు - నష్టాల్లో రైతులు :** వర్షాధారం మీద ఆధారపడిన రైతులు ప్రధానంగా పొగాకు, శనగ, సుబాబుల్, మిర్చి, పత్తి లాంటి వాణిజ్య పంటలు వేస్తున్నారు. మాగాణి తక్కువ. జిల్లా సగటు వర్షపాతం 751 (మి.మీ) తక్కువగా వున్నందున కరువుబారిన పడుతున్నారు. మార్కెట్లలో దోపిడీ తీవ్రంగా వుంది. జిల్లా రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారు. పొగాకు సాగు చేసే రైతులకు ఒక బ్యారన్‌కు రూ.4.5లక్షలు ఖర్చవుతోంది. సరాసరి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తే తాజా ధర ప్రకారం క్వింటాకు రూ.9.500 పలికితే రాబడి రూ.3.6లక్షలు మాత్రమే వస్తున్నాయి. శనగ సాగుకు ఎకరాకు రూ.18వేలు ఖర్చవుతుంది. సరాసరి దిగుబడి 5.5క్వింటాళ్లు వస్తోంది. గత ఏడాది సరాసరి రాబడి రూ.20వేలు ఉంది. పత్తి సాగుకు ఎకరాకు రూ.30వేలు ఖర్చు అవుతుంది. అదేమేరకు రాబడి కూడా ఉంటుంది. మిర్చి ఎకరా సాగుకు లక్ష రూపాయలు ఖర్చవుతుండగా గత ఏడాది 25క్వింటాళ్లు దిగుబడి వచ్చింది. క్వింటా ధర రూ.6వేలు ఉండగా లక్షన్నర రూపాయల మేరకు రాబడి వచ్చింది.

**పేదరైతులు - కౌలురైతులు :** అధికకౌలురేట్లు – వ్యవసాయ పరికరాలు లేకపోవడం – సొంత పెట్టుబడిలేక వడ్డీవ్యాపారులపై ఆధారపడటం – సరైన నీటి వసతిలేక పంట దిగుబడులలో వ్యత్యాసం – ధరల ఒడిదుడుకులు ఇవన్నీ కలసి క్రమంగా పేద, కౌలురైతులను నష్టాల ఊబిలోకి నెడుతున్నాయి. కౌలురైతులు జిల్లాలో రెండు లక్షల మంది ఉన్నట్లు ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. వారందరికీ గుర్తింపు కార్డులు జారీ

చేయలేదు. గత ఏడాది కేవలం 15వేల మందికే గుర్తింపు కార్డులు ఇచ్చారు. బ్యాంకుల్లో రుణాలు ఇవ్వడం లేదు. ఇప్పటి వరకూ కేవలం ఐదువేల మంది కౌలు దార్లకే బ్యాంకు రుణాలు జిల్లాలో అందాయి. గత ఏడాది మరింత ఘోరంగా 50మందికే రుణసాయం అందింది. ఫలితంగా వడ్డీ వ్యాపారులు, ఫైనాన్స్ సంస్థల గుప్పెట్లో కౌలు రైతులు ఇరుక్కుని అప్పుల పాలవుతున్నారు.

**పాడి పరిశ్రమ :** జిల్లాలో పాడిపరిశ్రమ ప్రధానమైంది. 9 లక్షల పశువులు వున్నవి. లక్ష కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నారు. ప్రతిరోజు 7 లక్షల లీటర్లు సేకరిస్తుంటారు. గతంలో 2006కి ముందు 8 లక్షల లీటర్లు ఉత్పత్తి అయ్యేది. క్రమంగా తగ్గుముఖం పట్టి, ఖర్చులు పెరిగాయి. మేత సౌకర్యం సరిగాలేదు. తీవ్రంగా వెన్నశాతం కోతపెట్టడం వలన రైతులు నష్టపోతున్నారు. ప్రధాన కంపెనీల గుప్పెట్లో జిల్లా పాడి రైతుల జీవితాలు వున్నాయి. 1) హెరిటేజ్ 2) జెర్సీ 3) తిరుమల 4) ఎలైన్ 5) దొడ్ల 6) ఒంగోలు డెయిరి... ఇవి కాక మరో 100 శీతలకేంద్రాల వారు పై 6 కంపెనీలకే అమ్ముకోవాలి. మార్కెట్ చేసుకొనే శక్తి వారికే వుంది. పాడి రైతులను ప్రైవేటు కంపెనీల దయాదాక్షిణ్యాలకు వదలింది ప్రభుత్వం. గ్రామాలలో పశువులకు వైద్య సౌకర్యం నామమాత్రం. జిల్లా పాలకు మంచి పేరుంది. వెన్నశాతం ఎక్కువ. రుచి ఎక్కువ. అయినా రైతులు నష్టపోతున్నారు. ఉత్పత్తిదారులకు సరాసరిన లీటరుకు రూ.30 దక్కుతుండగా, ఆ పాల నుంచే వెన్నతీసి వినియోగదారులకు లీటరు రూ.50 అమ్ముతున్నారు. ఈ మేరకు పాల ఉత్పత్తిదారులూ దోపిడీకి గురవుతున్నారు. ఫలితంగా జిల్లాలో పాడిపరిశ్రమ తిరోగమనంలో వుంది. మరోవైపు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఒంగోలు జాతి గిత్తల అభివృద్ధికి చేపట్టిన చర్యలేమీ లేవు. చదలవాడ వంటి పశుక్షేత్రాల్లోనూ ఒంగోలు జాతి అనిచెప్పుకోదగిన పశుసంపద లేని దుస్థితి ఏర్పడింది.

**వ్యవసాయ రంగం - పరిష్కారాలు :**

1) స్వామినాధన్ కమిటి సిఫార్సులు అమలు జరపాలి.
2) సాగునీటి వనరులు పెంచాలి.
3) పంటలకు పెట్టుబడి, శ్రమ ఆధారంగా గిట్టుబాటు ధరలు నిర్ణయించి, అవసరం అయితే ప్రభుత్వమే మార్కెట్లోకి దిగి కొనుగోలు చేయాలి.
4) రుణ సదుపాయం పెంచాలి.
5) కౌలు రైతులందరకూ గుర్తింపుకార్డులు ఇవ్వాలి. రుణాలు మంజూరుచేయాలి.

పంటలకు నష్టపరిహారం అందించాలి. ప్రభుత్వ ప్రోత్సాహకాలు వీరికి అందేలాగా నిబంధనలు రూపొందించాలి.

6) పాడి రైతులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి. ప్రైవేటు కంపెనీలను కట్టడి చేయాలి.

7) గొర్రెల, మేకల పెంపకందార్లకు వైద్యం, భూమి, రుణసౌకర్యం కలిగించాలి.

## ప్రాజెక్టుల స్థితిగతులు

వెనుకబడిన జిల్లాల్లో మనదే మొదటిస్థానంలో వుంది. జిల్లా అభివృద్ధి చెందాలంటే నీటి వనరులు వుండాలి. మన జిల్లాలో వర్షాధారంమీద ఆధారపడిన భూమి 80% పైన వుంది. కేవలం 21% భూమికి మాత్రమే నీటివనరులు వున్నాయి. కాలువల ద్వారా కేవలం 11% మాత్రమే. ఎందుకని? గుంటూరుజిల్లాలో 64% నీటి వనరులుంటే, పశ్చిమగోదావరిలో 74% పైమాటే. మనకు అదనపు వనరులు కేటాయించి నీటివనరులు కల్పించాలి. నైరుతి, ఈశాన్య రుతుపవనాల రెండింటికీ చివర కావడంతో మనజిల్లా 'రెయిన్‌షెడ్' ఏరియాగా మారింది. ప్రత్యేకశ్రద్ధతో మాత్రమే ఈ పరిస్థితిని అధిగమించగలం. తరచూ కరువు, కాటకాలకు లోను కావటానికి, రైతాంగం అప్పులపాలుకావటానికి, వలసలు పెరగటానికి, జిల్లా అభివృద్ధి చెందకపోవటానికి ప్రధాన కారణం, సాగునీరు ప్రాజెక్టులు పూర్తికాకపోవడమే.

పై ఆరు ప్రాజెక్టులను పూర్తిచేయటానికి ప్రభుత్వ అంచనాలు 6,015 కోట్ల 38 లక్షలు. ఇప్పటికీ 4,409కోట్ల 58 లక్షలు ఖర్చుచేశారు. నిధులు కేటాయించి పనులు పూర్తిచేస్తే 28 మండలాల్లో 5లక్షల 65 వేల ఎకరాలు సాగులోకి వచ్చే అవకాశం వున్నది. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా అన్ని ప్రాజెక్టులు పెండింగ్‌లో వున్నాయి.

**1) వెలుగొండ:** ఈ ప్రాజెక్టు 2006లో ప్రారంభించారు. 2009కి పూర్తిచేసేందుకు కాంట్రాక్టర్లు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారు. కాని 2011కి పొడిగించడం జరిగింది. ప్రధానంగా రెండు టన్నెల్స్ పనులు ఆగిపోయాయి. ఒక టన్నెల్ 12.8 కి.మీ, రెండో టన్నెల్ 7 కి.మీ సొరంగాలు మాత్రమే వేశారు. 18 కి.మీ వరకు సొరంగాలు పూర్తిచేయాల్సివుంది. కాంట్రాక్టర్ గిట్టుబాటు కావటంలేదని పనులు ఆపేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 4 లక్షల 40వేల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల మంది ప్రజలకు త్రాగునీరు సమస్య పరిష్కారమవుతుంది. పశ్చిమప్రాంతం అభివృద్ధి అవుతుంది. మొదట ప్రాధాన్యత ఈ ప్రాజెక్టుకు ఇవ్వాలని సిపియం కోరుతున్నది.

**2) గుండ్లకమ్మ రిజర్వాయర్ :** ఈ రిజర్వాయర్‌కి 592 కోట్లు అంచనా కాగా 678 కోట్లు ఖర్చుపెట్టారు. రిజర్వాయర్ పూర్తయింది. 25 కి.మీ చిన్న కాల్వలు

త్రవ్వనందువల్ల ఫీల్డ్‌ఛానల్స్ వేయలేకపోయారు. 100 ఎకరాల భూ సేకరణ చేస్తే పరిష్కారమౌతుంది. రెవిన్యూవారి లోపం కారణంగా రైతులు కోర్టుకి వెళ్ళినందున ఈ కాల్వపనులు ఆగిపోయాయి. సబ్ కాంట్రాక్టర్లు చేసిన పనులను ఇరిగేషన్ డిపార్టుమెంట్‌కి అప్పగించనందువల్ల ఈ సమస్య జఠిలమైనది. ఒంగోలు, చీరాల, జాతీయ రహదారిలో రెండు కల్వర్టులు, ఒంగోలు, ఇంకొల్లు రహదారిలో ఒక కల్వర్టు నిర్మించాల్సివుంది. ఆర్ & బి, ఇరిగేషన్ శాఖలమధ్య సమన్వయంలేదు. పర్యవసానంగా ప్రాజెక్టు పూర్తయినా 80వేల ఎకరాలకు సాగుకావల్సిన రిజర్వాయర్ నిరుపయోగంగా పడివున్నది. ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇది పెద్ద నిదర్శనం.

| వ.నె | రిజర్వాయర్‌పేరు | మొత్తం అంచనా కోట్లలో | ఇప్పటి వరకు ఖర్చు కోట్లలో | సాగుభూమి అంచనా ఎకరాలు | త్రాగునీటి అంచనా మండలాలు |
|---|---|---|---|---|---|
| 1. | వెలుగొండ | 5,150 | 3,600 | 4,47,000 | 30 |
| | | | | (15 మం.) | 15ల.మంది |
| 2. | గుండ్లకమ్మ | 592 | 678 | 80 వేల ఎ. | 1 |
| | | | | (4 మం.) | |
| 3. | చినపోలిరెడ్డి కోరిశపాడు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం | 177 | 92 | 20వేల ఎ. 2 మం. | 2 |
| 4. | సంగమేశ్వర పాలేరు రిజర్వాయర్ | 50.5 | 10.99 | 9,500 (3 మం.) | 3 |
| 5. | భవనాసి రిజర్వాయర్ | 27 | 22.53 | 7వేల ఎ. 2 మం. | – |
| 6. | పాలేటిపల్లి రిజర్వాయర్ | 18.88 | 6 | 1500 (2 మం.) | – |
| | | **6015 కో. 38లక్షలు** | **4,409కో 52 లక్షలు** | **5,65,000 28 మండ.** | **36 మండలాలు** |

**3) చినపోలిరెడ్డి కోరిశపాడు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ :** 177 కోట్ల అంచనాలతో 2008లో ప్రారంభించారు. ఇప్పటికి 92కోట్లు ఖర్చుచేసినారు. 2009 కి పూర్తికావాలి. రెండుగ్రామాల రైతుల నుంచి 93 ఎకరాల సేకరణలో వచ్చిన వైఫల్యంగుండా ఈ ప్రాజెక్టు నిలిపివేయబడినది. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితం వచ్చేదయినా ప్రభుత్వం

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది.

**4) సంఘమేశ్వరపాలేరు రిజర్వాయర్ :** 50.5 కోట్ల అంచనాతో 2007లో ప్రారంభించి 2009లో ముగించే ఒప్పందంతో ఈ ప్రాజెక్టుని ప్రారంభించడం జరిగింది. ఇది పూర్తయితే పొన్నలూరు, జరుగుమల్లి, కొండపి, మర్రిపూడి మండలంలో 9,500 ఎకరాలకు సాగునీరు, 3 గ్రామాలకు త్రాగునీరు సమస్యని పరిష్కరించవచ్చు. 11 కోట్ల ఖర్చుచేశారు. ప్రస్తుతం ప్రాజెక్టుపనులు ఆగిపోయినాయి. తక్షణంప్రాజెక్టుని పూర్తిచేసి 4 మండలాల సాగు, త్రాగునీటి సమస్యని పరిష్కరించాలి. పొన్నలూరు చెరువుకి సప్లయ్‌ఛానల్ ఏర్పాటుచేస్తే నీటిలభ్యత పెరుగుతుంది. చిన్న ప్రాజెక్టు అయినా మధ్యలో వచ్చే సమస్యలను పరిష్కరించలేక ప్రభుత్వం చతికిలపడింది.

**5) ఒభవనాసి రిజర్వాయర్:** 27 కోట్ల అంచనాలతో ప్రారంభించినారు. గోకుల కొండ నుండి 12.6 కి.మీ కాల్వద్వారా భవనాసి చెరువుకి నీళ్ళు మళ్ళించి, దిగువున 7వేల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు పనులు ప్రస్తుతం ఆగిపోయినవి. వెంపరాల గ్రామం వద్ద ఒక కి.మీ కాల్వత్రొవ్వడానికి బ్లాస్టింగ్ అనుమతి ఇవ్వాలి.కాల్వకోసం ఆరు ఎకరాలు సేకరించాలి. మైనింగ్, ఇరిగేషన్ శాఖలమధ్య సమన్వయం లేక ఈ పనులు ఆగిపోయాయి. భూసేకరణ 223 ఎకరాలు సేకరించాలి. రెవిన్యూ వారి నిర్లక్ష్యంవల్ల భూసేకరణ జరగలేదు. ఈ ఆటంకాలను ప్రభుత్వం పరిష్కరించి, వెంటనే రిజర్వాయర్ పూర్తిచేయాలి.

**6) పాలేటిపల్లి రిజర్వాయర్ :** ఇది పి.సి.పల్లి మండలంలో 18 కోట్ల 88 లక్షల అంచనాతో కనిగిరి, పి.సి.పల్లి మండలంలోని త్రాగు, సాగునీటి సమస్యల పరిష్కారం కోసం ప్రారంభించారు. 2012లో ఈ పనులు ప్రారంభించి 2013కు పూర్తిచేయాలి. ఇప్పటికే 7 కోట్ల 88 లక్షలు ఖర్చుచేశారు. భూసేకరణ, కుడి, ఎడమ కాల్వల త్రవ్వకం పనులు ఆగిపోయాయి.

ఇదీ జిల్లాలోని ప్రాజెక్టుల దుస్థితి. నాగార్జున సాగరు కుడికాలువ క్రింద మన జిల్లాలో వెనుకబడిన ప్రాంతాలకు నీరు అందేలా చూడాలి. సాగర్ 2వ దశకు అంచనాలు వేయించి పనులు ప్రారంభించాలి. తద్వారా జిల్లాలో మరొక 3 లక్షల ఎకరాల భూమికి సాగునీరు అందుతుంది. సాగరు-1వ దశలో 4.70 వేల ఎకరాలకు నీరు అందించాలి. కాని అందుతుంది 1.70 వేల ఎకరాలకు మాత్రమే. జిల్లాకు రావాల్సిన మేరకు సాగర్ జలాల్లో వాటా అందడం లేదు. చివరి ఆయకట్టు భూములకు చుక్కనీరైనా రావడం లేదు. జిల్లా అభివృద్ధి కావాలంటే సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేయాల్సిందే.

1) పెండింగులో వున్న 6 ప్రాజెక్టులను వెంటనే పూర్తిచేయాలి.

2) సాగర్ మొదటిదశకు ప్రకాశం వాటా అయిన 75 టి.యం.సి.ల నీరు ప్రతి సం॥రం అందించాలి. (ప్రస్తుతం 25 టి.ఎం.సిల నీరు మాత్రమే అందుతుంది).

3) సాగరుకాలువ రెండవదశకు కొత్తగా డిజైన్ చేసి పనులు ప్రారంభించాలి.

4) వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి పశ్చిమప్రాంతానికి తాగు, సాగునీరు అందేలా చేయాలి.

5) జిల్లాలో వున్న 330 చెరువులను మరమ్మత్తులు పూర్తిచేసి సాగుని పెంచాలి.

6) ముసి, పాలేరు, గుండ్లకమ్మ నదులలో వృధాగాపోతున్న 50 టి.ఎం.సిల నీరుని సాగుకు ఉపయోగపడేలాగా లిఫ్టులు, చెరువులు నిర్మించాలి.

## భారీపరిశ్రమలులేని - పారిశ్రామిక రంగం

జిల్లాలో పారిశ్రామికంగా బాగా వెనుకబడి వుంది. చెప్పుకోదగ్గ పరిశ్రమ ఒక్కటి లేదు. వున్న కొద్దిపాటివి కూడా ప్రధానంగా ఆక్వా, గ్రానైట్ మీద ఆధారపడిన పరిశ్రమలే. జిల్లాలో మొత్తం 6,894 పరిశ్రమలు వున్నవి. వీటిలో 71,663 మంది కార్మికులు పని చేస్తున్నారు. అందులో కొంచెం పెద్ద పరిశ్రమలు 54 మాత్రమే. దీనిలో 930 కోట్ల పెట్టుబడులు పెట్టారు. 9,749 మంది కార్మికులు పనిచేస్తున్నారు.

జిల్లాలో మొత్తం 5 లక్షల మందికిపైగా కార్మికులు వున్నారు. అందులో కేవలం పారిశ్రామిక కార్మికులు 71,663 మంది మాత్రమే వున్నారు. 1000 మంది కార్మికులు పనిచేసే పరిశ్రమ ఒక్కటి కూడాలేదు.

వ్యవసాయ అనుబంధంగా 1046 యూనిట్లు, మినరల్ బేసెడ్ 951, ఇంజనీరింగ్ 309, ఫుడ్ బేసెడ్ 665, కెమికల్ బేసెడ్ 495, టెక్స్‌టైల్స్ 55, ఫారెస్ట్ బేసెడ్ 1206, ఇతర పరిశ్రమలు 2,167 యూనిట్లు ఉన్నాయి.

ఇదీ జిల్లాలో పారిశ్రామిక చిత్రం. ప్రకాశంజిల్లా అభివృద్ధి కావాలంటే ముందుగా ప్రభుత్వ రంగంలో భారీ పరిశ్రమలు రావాలి. ఆ తరువాత వాటికి అనుబంధంగా పరిశ్రమలు వస్తాయి. అభివృద్ధి అయిన జిల్లాల్లో, నగరాలు అన్నింటా ప్రభుత్వ పెట్టుబడులతో ముందుగా భారీపరిశ్రమ పెట్టిన తరువాతనే, ఇతర అనుబంధ రంగాలలో ప్రైవేటు పరిశ్రమలు వచ్చినవి. ఇది రాష్ట్ర అనుభవం.

జిల్లాలోని ఖనిజ వనరుల ఆధారంగా ప్రభుత్వమే పరిశ్రమలు స్థాపించాలి. ఇసుక ప్రాంతంలో సిలికాన్ ఆధారంగా గ్లాస్, పింగాణి పరిశ్రమలు పెట్టాలి. పండ్ల తోటల ఉ

త్పత్తుల ఆధారంగా జిల్లాలోని ఉలవపాడు, కనిగిరి, యర్రగొండపాలెం, గిద్దలూరు వంటి ప్రాంతాల్లో బత్తాయి, నిమ్మ పంటల ఆధారంగా జ్యూస్, ప్రొసెసింగ్ పరిశ్రమలు స్థాపించాలి. టమోటా ఉత్పత్తుల నిల్వకు పశ్చిమ ప్రాంతంలో కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటు చేయాలి. పొగాకు ఆధారిత సిగరెట్ పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలి. రొయ్యలు, చేపల ప్రొసెసింగ్ యూనిట్లనూ నెలకొల్పాలి. దొనకొండ, కనిగిరి, వాన్‌పిక్ ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపనకు ప్రత్యేక కృషి చేయాలి.

మానవ వనరులు అన్ని రకాలుగా అభివృద్ధి అయినా ఎక్కువ అవకాశంలేక బయట ప్రాంతాలకు వెళుతున్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం ప్రోత్సాహకాలన్నింటిని కొత్త రాజధాని అమరావతి, తుళ్ళూరులకే ప్రకటించుచున్నారు ప్రకాశం జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ఎలాంటి ప్రోత్సాహకాలు ప్రకటించలేదు. రాజకీయ వివక్షతను ప్రదర్శిస్తున్నారు. ప్రభుత్వాన్ని మెడలు వంచేందుకు ఆందోళన చేస్తేగాని ప్రత్యేకప్యాకేజిని సాధించలేము.

### పారిశ్రామిక అభివృద్ధికి సూచనలు

1) ప్రభుత్వరంగంలో భారీ పరిశ్రమలను పెట్టాలి.
2) జిల్లాలో వున్న సహజవనరులను గుర్తించి వాటికనుగుణంగా పరిశ్రమలు స్థాపించాలి.
3) పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు ప్రకటించాలి.
4) మౌలిక సదుపాయాల అభివృద్ధికి తగిన పెట్టుబడులు ప్రభుత్వం పెట్టాలి.
5) పశ్చిమ ప్రాంతానికి ప్రాధాన్యత ఇవ్వాలి.

### పరిష్కరించని భూ సమస్య

విశాలాంధ్రలో ప్రజారాజ్యంలో ప్రకాశం జిల్లా గురించి సుందరయ్య గారి మాటల్లో ... "జమిందారీలన్నింటిని రద్దుచేసి – దున్నేవారికే భూమి దక్కాలని తద్వారా అధిక పంటలు పండించడం ద్వారా రాష్ట్ర అభివృద్ధి జరుగుతుంది". వెంకటగిరి జమిందారీ రద్దయినా నేటికి దున్నేవారికి భూమి దక్కలేదు. ఇప్పటికి జిల్లాలో 6,73,000 మంది వ్యవసాయ కార్మికులు, 2 లక్షల కౌలుదార్లు శ్రమదోపిడీకి గురౌతున్నారు. దారిద్రరేఖకు దిగువ జీవిస్తున్నారు. జిల్లాలో సాగుకు అనువైన 19 లక్షల ఎకరాల భూమిలో వీరికి వాటా ఇవ్వకుండా జిల్లా అభివృద్ధి పథంలో నడవడం అసాధ్యం.

**భూ సమస్య - వర్గీకరణ వివరాలు :**

| | | |
|---|---|---|
| జియోగ్రాఫికల్ ఏరియా | - | 17,626 చ.కి.మీ |
| జిల్లా విస్తీర్ణం | - | 42,35,572 ఎ. |
| అటవీ విస్తీర్ణం | - | 10,93,682 ఎ. (26%) |
| సాగుకు యోగ్యంకాని భూమి | - | 3,72,897 ఎ. (9%) |
| సాగుకు యోగ్యమైన భూమి | - | 19,50,000 ఎ. (46%) |
| సాగుకు యోగ్యమైన బంజరు | - | 1,60,505 ఎ. (4%) |
| నికర సాగు (వినియోగంలోవున్న) | - | 13,49,740 ఎ. (39%) |
| వ్యవసాయ కార్మికులు | - | 6,73,018 ఎ. (22%) |
| పేదరైతుల వద్దనున్న భూమి | - | 3,99,869ఎ. (61% మంది) |
| చిన్న రైతులవద్ద | - | 5,27,246 ఎ. (27%) |
| మధ్యతరగతి | - | 5,90,433 ఎ. (14%) |
| ధనిక రైతులు | - | 4,20,184 ఎ. (5%) |
| భూస్వాములు | - | 1,00,265 ఎ. (0.4%) |
| జిల్లాలోభూపంపిణి (1947తరువాత) | - | 2,80,000ఎ. |
| అన్యాక్రాంతం | - | 36,465 ఎ. |

నూటికి 5%గా వున్న ధనికరైతులు భూస్వాముల చేతుల్లో 26% భూమి అనగా 5,20,000 ఎకరాలు వుంది. నూటికి 22%గా వున్న భూమిలేని వ్యవసాయ కార్మికులు 6,73,018 మందికి సెంటు భూమికూడాలేదు. వీరు ప్రధానంగా భూస్వాములు, ధనికరైతులదగ్గర పనిచేస్తూ లేదా కౌలుచేస్తూ జీవనం గడుపుతున్నారు. కుటుంబాలు గడవని స్థితిలో నిరంతరం వలస వెళుతున్నారు. భూ పంపిణీ మొక్కుబడిగా సాగింది. సీలింగ్ చట్టంలోని లొసుగులను ఉపయోగించుకొని పెత్తందార్లు సీలింగ్ భూమిని అనుభవిస్తున్నారు. ప్రభుత్వం భూస్వాములనుండి భూమిని తీసుకొని, పేదలకు పంచే బదులు పేదల భూములను వాన్‌పిక్‌లాంటి సంస్థలకు కట్టబెడుతున్నది.

**వాన్‌పిక్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి :** వాన్‌పిక్ ప్రాజెక్టు పేరుతో 20వేల ఎకరాలు భూమిని ప్రభుత్వం సేకరించింది. ఇందులో 6,493 ఎకరాలు ప్రభుత్వ భూమి వుంది. ఈ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ఆ భూముల్లో ఓడరేవు,

టెక్స్‌టైల్ పరిశ్రమలు స్థాపించి వేలాది మందికి ఉపాధి కల్పించాలి. నాగులుప్పలపాడు మండలంలోని ప్రభుత్వ భూముల్లో జన్‌కోను స్థాపించి పారిశ్రామిక ఉత్పత్తికి తోడ్పడాలి. తద్వారా వెనుకబడిన ప్రకాశంజిల్లా అభివృద్ధికి ఉపయోగం జరుగుతుంది. ఇంకా మిగిలిన భూములను అర్హులైన పేదలకు పంచాలి.

**పేదలకు శాపంగా మారిన ప్రభుత్వ చర్యలు :** 1) అసైన్‌మెంట్ భూములకు పట్టా భూములతో సమానంగా నష్టపరిహారం ఇవ్వాలని 2004లో రాష్ట్ర హైకోర్టు ధర్మాసనం చెబితే, దీనికి వ్యతిరేకంగా పాలకులు సుప్రీంకోర్టులో స్టే పొందారు. 2) అసైన్‌మెంట్ భూములను పేదలకు కాకుండా పెద్దలకు ఇచ్చేటట్లు 2006లో అసైన్‌మెంట్‌కు చట్టసవరణ చేశారు. 3) అసైన్‌మెంట్ భూములు ఇతరులకు క్రమబద్ధీకరిస్తూ 2007లో మరో సవరణ తెచ్చారు. 4) దేవాలయ భూములు బహిరంగ వేలంకు అనుమతిస్తూ, 2006 నుండి బలవంతుల వశం చేశారు. 5) పేదలకు దక్కాల్సిన సీలింగ్ భూములను కంపెనీలకు ఇస్తూ భూసంస్కరణల చట్టం తెచ్చారు. 6) సహకార వ్యవసాయం పేరుతో పేదల భూములను కంపెనీలకు ఇచ్చేందుకు చట్టం తెచ్చారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో సెజ్‌ల పేరుతో 6.7లక్షల ఎకరాలు బదిలీ చేశారు. పైగా ఇటీవల ప్రభుత్వ భూములు లక్ష ఎకరాలను పారిశ్రామిక వేత్తలకు కట్టబెట్టేందుకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధం చేసింది. పై చర్యల వలన ప్రధానంగా ప్రాజెక్టు నిర్వాసితులుగా వున్న అసైన్డ్‌పేదలు నష్టపరిహారం పొందలేక పోయారు. సంవత్సరాల తరబడి సాగుభూమికై అర్జీలు పెట్టుకొన్నా పేదలకు భూములు దక్కడంలేదు.

**పంపిణీకాని వందలాది ఎకరాలు :** మారెళ్ళ–120, ఆర్.ఆర్.నగర్–175, బొట్లపాలెం–400, కె.కె.మిట్ల –200, చిన్నపవని–350, చిన్నలాటరపి–300, హాజీపురం–150, పునుగోడు–125, బోడవాడ–200, అయ్యన్నకోట–300, గుమ్మళంపాడు–200, ఆనికాళ్ళపల్లి–300, నల్లమడుగుల–400, డి. తిమ్మక్కపల్లి–100, ఎ. కొత్తపల్లి–215, కొత్తపట్నం–300, ఈతముక్కల–200, అల్లూరు–125, దివాకరపల్లి–200, నేరేడుపల్లి–900, చింతగుంపల్లి–1,914 నాగిరెడ్డిపల్లె–300, ఆర్.ఎల్.పురం–185, ఆకవీడు–260, అక్కపల్లి–300, తంగిరాల–181, వై.పాలెం–250, కొలుకుల–100, ఎండ్రపల్లి–150, ముటుకుల–150, త్రిపురాంతకం–216, గణపవరం–250, దూపాడు–150, తుమ్మలపల్లి–350, తోకపల్లి–100, తిమ్మాపురం–150, చిలకచర్ల–300, నికరంపల్లి–100, చింతగుండ్ల –100, మీర్జాపేట–750, నాగండ్ల ముడిపి – 150, గొల్లపల్లి – 250, తుమ్మల

చెరువు–150, చిన్నగంజాం–360 ఎకరాలు సంవత్సరాల తరబడి పేదలు ఆందోళన చేస్తున్నా భూమి పంపిణీ జరగలేదు. సమస్య పరిష్కారానికి ఈ క్రింది చర్యలు తీసుకోవాలి.

**డిమాండ్స్ :** 1) సాగుకు యోగ్యమైన ప్రభుత్వ భూములను వెంటనే పేదలకు పంచాలి. 2) అన్యాక్రాంతమైన భూములను తిరిగి స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలి. 3) పేదల భూములు కాజేసే భూ ఆర్డినెన్స్, చట్టాలను రద్దుచేయాలి. 4) రీ లోకలైజేషన్ చేసి సీలింగ్ చట్టాన్ని అమలు చేయాలి.

## సాధికారతలేని మహిళలు

జిల్లాలో 16,80,029 మంది మహిళలు వున్నారు. వ్యవసాయం, పాడి పరిశ్రమలు, అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్నభోజనం మొదలైన అన్నింటిలో మహిళలు లేకపోతే ఉత్పత్తిలేదు. కుటుంబంలోను, పిల్లల పెంపకంలోను, సామాజిక బాధ్యతల్లోను ప్రధానపాత్ర వహిస్తున్నారు. మహిళల అక్షరాస్యతాశాతం 53% మాత్రమే వుంది. సమాజంలో, కుటుంబంలో చిన్నతరహా పనులే చేస్తున్నారు. ప్రజాప్రతినిధులుగా వున్న సముచితస్థానం దక్కడంలేదు. మద్యం ప్రధాన ఆదాయవనరుగా ప్రభుత్వం చర్యలు వున్నందున మహిళలపై గృహహింస, దాడులు పెరిగాయి. కుటుంబ సమస్యలు, ఆర్థిక సమస్యలు వీరిని వెంటాడుతున్నాయి. అభివృద్ధి ఫలాలు వీరికి అందడంలేదు. జిల్లా అభివృద్ధి ఉద్యమంలో మహిళలను భాగస్వాములను చేయాలి. జిల్లాలో 49,300 డ్వాక్రా గ్రూపుల్లో 4,95,886మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వారంతా సుమారు రూ.225కోట్ల రూపాయల మేరకు పొదుపు చేశారు. వారి పొదుపు సొమ్మును ఉపయోగించు కుంటున్న పాలకులు ప్రభుత్వ కార్యక్రమాలకు బలవంతంగా తీసుకెళ్తున్నారు. ధనశ్రీ, అభయహస్తం వంటి పథకాల్లో తప్పని సరిగా చేరాలనే నిబంధనలు పెడుతున్నారు. రుణాలు సక్రమంగా ఇవ్వడం లేదు. రుణమాఫీ చేస్తామంటూ ఆశలురేపారు. ఇప్పుడు దానికీ సాకులు చెబుతున్నారు. మాఫీని అందరికీ వర్తింప చేయాలి. పావలా వడ్డీని ఇవ్వాలి. గ్రూపుల్లో చేరిన మహిళల పిల్లలకు స్కాలర్ షిప్పులు అందించాలి. మహిళా సాధికారత సాధించే దిశగా ప్రభుత్వ చర్యలు ఉండాలి.

## అభివృద్ధికి దూరంగా దళితులు, గిరిజనులు

**దళితులు :** యస్సీ జనాభా 7,87,861 మంది వున్నారు. రాష్ట్రంలో మనజిల్లాలోనే అత్యధికంగా 23.2 శాతం వున్నారు. 26 మండలాల్లో 25% పైగా వున్నారు. దళితకుటుంబాలు సుమారుగా 2 లక్షలువున్నాయి. అందులో 48 వేలకుటుంబాలకు కొద్దిపాటి మాత్రమే భూమివుంది. అత్యధికులు వ్యవసాయ కార్మికులుగా వున్నారు. అందులో

పనిదినాలుతగ్గి అసంఘటిత రంగంలోకి, మాగాణిప్రాంతంలో కౌలురైతులుగా మారుతున్నారు. జిల్లా అక్షరాస్యత 63.8% కాగా, యస్సీల్లో 59.7, యస్సీ మహిళల్లో అది 49.9% గా వుంది.దళితవాడల్లోని పిల్లలు వందమంది ఒకటో తరగతిలో చేరితే ఐదోతరగతికి యాభై, పదొతరగతికి పాతికమంది మిగులు తున్నారు. పైచదువులకు 15 శాతం మాత్రమే వెళ్ళగలుగుతున్నారు. రిజర్వేషన్లు 16 శాతమున్నా ఉద్యోగాలు పొందగలుగుతున్నవారు 4 శాతంలోపే.వారిలోకూడా 4 వతరగతి ఉద్యోగులే అధికంగావున్నారు.వలసలు, ఆర్థిక ఇబ్బందులతో పిల్లలను చదువు మాన్పించి పనులకు తీసుకెళ్ళటం ఇందుకు ప్రధాన కారణంగావుంది.ఆ కొద్దిపాటి అవకాశాలుకూడా లేకుండా ప్రభుత్వం క్లస్టర్స్కూల్స్ పేరుతో ప్రాధమిక విద్యకు మంగళం పాడనున్నది.పోలీసు, టీచర్ పోస్టులుమినహా ప్రభుత్వం క్రొత్త ఉద్యోగాలు భర్తీచేయడంలేదు.పాలకులే రిజర్వేషన్లను నిరుపయోగం చేస్తున్నారు.అందువలన ప్రవేటురంగంలో రిజర్వేషన్ల ఆవశ్యకత ఎంతోవుంది.

ఉపాధి, భూమి, ఇండ్లస్థలాలు, పక్కాఇండ్లు, వైద్యం ప్రధాన సమస్యలుగా వున్నాయి. నివాసప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజి, వీధిలైట్లు, మంచినీరు, మరుగుదొడ్లు లాంటి మౌళికవసతుల కల్పనలో వివక్షత కొనసాగుతున్నది.1100 దళితవాడలుంటే అందులో 450 వాడలకు శ్మశానాలులేవు.375 గ్రామాల్లో ఆక్రమణలకు గురౌనాయి. 178 గ్రామాల్లో వాటికి బాటలులేవు. సబ్ప్లాన్ నిధులు ప్రకటనలకే పరిమిత మౌతున్నది. ఎస్సీకార్పోరేషన్ అలంకార ప్రాయమైంది.పెత్తందార్ల వేధింపులు, దాడులు, దౌర్జన్యాలు, సాంఘీక బహిష్కరణలు కొనసాగుతూనే వున్నాయి. ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అణిచివేతకు గురౌతున్నారు.

**గిరిజనులు :** జనాభా1,51,145 మంది, 4.4శాతంవున్నారు.ఆరుమండలాల్లో 10 శాతం పైగావున్నారు.నల్లమల అటవీప్రాంతం వై.పాలెం, పుల్లలచెరువు, దోర్నాల, తదితర మండలాల్లో 69 గూడేలలో 12,000 మందికి పైగా అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవిస్తున్నారు. అక్షరాశ్యత 38.15 వుండగా మహిళల్లో 28.96 శాతం వుంది.అటవీ ఉత్పత్తుల సేకరణ, చేపలుపట్టటం, చిల్లకర్రకొట్టటం, జామాయిల్, సుబాబుల్ కోత లాంటి పనులు ప్రధానంగా చేస్తున్నారు.ఉలవపాడు, గుడ్లూరు మండలాల్లో కాయకోత పనులు చేస్తున్నారు.పట్టణాలో పారిశుద్యపనులు చేస్తున్నవారిలో వీరు అత్యధికులు.ప్రభుత్వ లెక్కల్లో భూమి 91 వేల ఎకరాలు వీరికి పంచినట్లు వుంది.కానీ ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో 25% అన్యాక్రాంతమైనట్లు గుర్తించింది. పౌష్టికాహారం, వైద్యసదుపాయాలు, విద్య నేటికీ అందుబాటులో లేదు.

**డిమాండ్స్ :**

1) ఎస్.సి., ఎస్.టి. సబ్‌ప్లాన్ నిధులు దళిత, గిరిజన అభివృద్ధికే ఖర్చుచేయాలి.

2) ప్రైవేటురంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలి.

3) జిల్లాలో వున్న మిగులు, బంజరు భూములను పంచాలి. అన్యాక్రాంతం అయిన భూములను తిరిగి ఇప్పించాలి.

4) దళిత, గిరిజనులలో వున్న యువకులను గుర్తించి స్వయంగా పరిశ్రమలను నెలకొల్పేలా ప్రోత్సహించాలి. రుణపరపతి సౌకర్యం కలిగించాలి.

## అభివృద్ధి ఫలాలు అందని సామాజిక తరగతులు

జిల్లాలో 33.97లక్షల మంది జనాభా ఉండగా వీరిలో 16లక్షల మంది బిసి సామాజికవర్గాలకు చెందిన ప్రజలు ఉన్నారు. నేటికీ 10లక్షల మంది చేతివృత్తులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రధానంగా చేతివృత్తులు దెబ్బతిన్నాయి. ఉపాధి కరువైంది. వలసలు పెరిగాయి.

ప్రభుత్వం ఆర్భాటంగా పథకాలు ప్రకటిస్తున్నది. వీరికి కేటాయించిన నిధులు ఇతర అవసరాలకు మళ్ళిస్తున్నారు. ప్రభుత్వ కేటాయింపులు ఈ సామాజికవర్గాల్లో దిగువస్థాయికి చేరడంలేదు. 2014–15 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ సామాజిక వర్గాలకు 180రకాల వృత్తులకు రుణాలు మంజూరు చేస్తామని "సమగ్ర కార్యాచరణ ప్రణాళిక" ప్రకటించారు. కాని ఆచరణలో 2015 జులై నెల ముగిసినా 10% కూడా రుణాలు ఇవ్వలేదు.

సరళీకరణ విధానాల వలన చదువుకున్న వారికి ఉపాధి దొరకడంలేదు. ప్రవేటీకరణ పేరుతో ప్రతి ప్రభుత్వ శాఖలో కాంట్రాక్టు ఉద్యోగాలు పెరిగాయి. ప్రవేటీకరణ వల్ల రిజర్వేషన్లు ఉన్నా ప్రయోజనం లేకుండా పోయింది. ఎస్సి, ఎస్టి, బిసిల్లో ఉపాధి అవకాశాలు బాగా తగ్గాయి. విద్యా, వైద్య, ఉపాధి కల్పనలో ఈ తరగతులు తీవ్ర నిర్లక్ష్యానికి గురి చేయబడ్డాయి.

యాంత్రీకరణతో చేతివృత్తులు ధ్వంసం అయ్యాయి. వృత్తివదిలి వెళ్లాలంటే అవమానంగా భావించే చేనేత కార్మికులు ఇప్పుడు మగ్గం వదిలి ఇతర వృత్తులకు వలస వెళుతున్నారు. చేనేత వృత్తిలో వచ్చే మజూరీ గిట్టుబాటు కావడంలేదు.

రజక వృత్తిదారులు తీవ్రమైన అవమానాలకు, అత్యాచారాలకు గురవుతున్నారు. పట్టణాలకు పెద్ద సంఖ్యలో వలస వస్తున్నారు. పట్టణాల్లో ఇళ్లలోనే వృత్తి కొనసాగిస్తున్నారు.

**గొర్రెలు - మేకల పెంపకందార్లు :** జిల్లాలో 14.2 లక్షల గొర్రెలు, 4.2 లక్షల మేకలు వున్నాయి. 1.50 లక్షల కుటుంబాలు గొర్రెల పెంపకంపై ఆధారపడి వున్నారు. జీవాలకు జబ్బులు, మేత, నీరు, దొడ్లు మొదలైన సమస్యలతో సతమతమౌతున్నారు. రుణాసౌకర్యంలేదు. అధిక వడ్డీల మీద ఆధారపడుతున్నారు. ప్రధానంగా బి.సి., ఎస్.సిల నుండి ఈ వృత్తిలో వుంటున్నారు. వీరికి ప్రభుత్వం ప్రోత్సాహంలేదు. సహకార సంఘాలు వున్నా పనిలోలేవు.

జిల్లా సముద్ర తీరం పొడవునా వేల సంఖ్యలో మత్స్యకారులు చేపల వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. తీరంలో పరిశ్రమల పేరుతో వీరి ఉపాధిని దెబ్బతీస్తున్నారు. ఈ పాటికే సముద్ర సంపద తరిగిపోతుంది. ఇతర రాష్ట్రాలు, దేశాలకు చెందిన మరబోట్లు మన తీరంలో చేపల వేట సాగిస్తూ మన మత్స్యసంపదను కొల్లగొడుతున్నారు.

క్షౌర వృత్తిదారులు జిల్లా అంతటా వ్యాపించి ఉన్నారు. ఈ వృత్తిదారులపై సామాజిక వివక్షత కొనసాగుతుంది. వృత్తిదారులను పన్నులు, లైసెన్సుల పేరుతో ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తుంది. ఈ వృత్తిలోనూ వ్యాపార దృక్పథం పెరిగింది. క్షౌర వృత్తికి సంబంధంలేని ధనవంతులు, పెట్టుబడులు పెట్టి పెద్ద పెద్ద ఎసి సెలూన్లు ఏర్పాటు చేయడంతో, అసలు వృత్తిపై జీవనం సాగిస్తున్న క్షౌర వృత్తిదారులు, కూలీలుగా మారే పరిస్థితి ఏర్పడింది. వడ్డెర, గీత, కమ్మరం, కుమ్మరి, కటిక, మేదర, వడ్రంగి వంటి 56రకాల సాంప్రదాయ వృత్తులు నేటికీ కొనసాగుతున్నాయి. వీరి అభివృద్ధికి, రక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపుతుంది.

జిల్లా జనాభాలో 7.2శాతంగా ఉన్న మైనార్టీలు ఎదుగు, బొదుగూ లేకుండా ఉన్నారు. విద్య, ఉపాధి అవకాశాల్లో వెనుకబడి ఉన్నారు. ఎక్కువ మంది మెకానిక్‌లుగా, టైలర్లుగా, చిరువ్యాపారులుగా జీవనం గడుపుతున్నారు. కొద్దిపాటి అనారోగ్యానికి గురైనా తట్టుకునే శక్తిలేదు. ఒకే గదిలో రెండు, మూడు కుటుంబాలు జీవనం సాగించే దుర్భర స్థితిలో ఉన్నారు.

## ధరల పెరుగుదల-పౌష్టికాహార లోపం

నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఆ స్థాయిలో చేతివృత్తుల్లో ఆదాయాలు పెరగడంలేదు. పౌష్టికాహార లోపంతో తరచూ అనారోగ్యంకు గురవుతున్నారు. క్షయ, రక్తహీనత, అల్సర్ వంటి వ్యాధులతో వైద్యశాలకు వచ్చే రోగుల్లో అత్యధికమంది చేతివృత్తుల్లో ఉన్న కార్మికులే ఉంటున్నారు.

సరళీకరణ విధానాల ఫలితంగా అంతరిస్తున్న చేతివృత్తుల మనుగడకు, వృత్తిదారుల జీవన ప్రమాణాలు పెంచేందుకు ఎస్సి, ఎస్టి ఉపప్రణాళిక లాగా బిసిలు, చేతివృత్తుల వారికీ జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించి ఖర్చు చేయడం ద్వారానే ఈ తరగతులు అభివృద్ధి చెందగలవు. భవిష్యత్‌లో చేతివృత్తుల ఉపప్రణాళిక కోసం జరిగే పోరాటాల్లో వృత్తిదారులు కలిసి రావాల్సిన అవసరం ఉంది.

### పెరుగుతున్న వలసలు - తరుగుతున్న ఉపాధి

జిల్లాలో 13లక్షల మంది శ్రమ చేయగలిగినవారు వున్నారు. వారిలో ప్రతిసం॥రం 4 లక్షలమంది వలసపోతున్నారు. వ్యవసాయంలో వడిదుడుకులు, యంత్రాల ప్రవేశం, కరువు, సాగుసరిగ్గా లేకపోవడం కారణంగా పనిదినాలు తగ్గినవి. ఉపాధిపనులు సరిగా జరగకపోవడానికి కేంద్రరాష్ట్ర ప్రభుత్వ విధానాలే కారణం. పర్యవసానంగా వలసలు మరింత పెరుగుతున్నవి.

**తగ్గిన పనిదినాలు - యంత్రాల ప్రవేశం :** వ్య.కార్మికులు 2011 లెక్కలప్రకారం 6,73,018 మందివున్నారు. వరి, ప్రత్తి, పొగాకు, మిర్చి, సుబాబుల్, జామాయిల్, కంది, శనగ ప్రధాన పంటలు. వీటిలో కూలీలు పనిచేస్తున్నారు. వరి జిల్లాలో 2.92 లక్షల ఎకరాల్లో సాగుచేస్తున్నారు.సగటున ఒక ఎకరాకు 50 పనిదినాలు చొప్పున సుమారుగా 1.46 కోట్ల పనిదినాలు లభిస్తున్నాయి. ప్రకృతిలో వచ్చిన మార్పుల ఫలితంగా వర్షాలు సకాలంలోరాక, వరినాట్లు కాలంలో నెల, కోతలు, నూర్పిడులు కాలంలో నెల రోజుల్లో పూర్తిఅవుతున్నాయి.ఈ సమయాల్లో మాత్రం కూలీల డిమాండ్ వుంటున్నది.ఇటీవల కాలంలో కోత, నూర్పిడి యంత్రాలు పెరిగాయి.కలుపునివారణ మందులు వచ్చాయి.ఫలితంగా పనిదినాలు తగ్గుతున్నాయి.

పొగాకు 1.50లక్షల ఎకరాల్లో సాగుఅవుతున్నది.నారువేసే దశనుండి ఆకుకొట్టి, అల్లిబ్యారన్‌లో కాల్చడం, టోకర్లు, క్రకొట్టేవాళ్లు మొత్తం సుమారు 1.25లక్షల మంది పనిచేస్తారు.ప్రత్యేకంగా 75 వేలమంది పచ్చాకుపనిలో రోజుకు12 నుండి 15 గంటలపాటు కనీస సౌకర్యాలు కూడా లేకుండా 3 నెలలు కాంట్రాక్టుపద్ధతిలో పనిచేస్తారు.

మిర్చిపంట గతసం॥రం 79 వేల ఎకరాల్లో, ప్రత్తి 1.77 లక్షల ఎకరాల్లో, శనగ 1.24 లక్షల ఎకరాల్లో సాగుఅవుతున్నది. శనగతోపాటు కంది, మొక్కజొన్న పంటల్లో నూర్పిడి యంత్రాలద్వారా జరుగుతున్నది. జామాయిల్, సుబాబుల్, సర్విసాగు సుమారు 2 లక్షల ఎకరాలుంది. చాలా పరిమితంగా పనిదినాలు వుంటాయి. ఇందులోకూడా తాటతీసే యంత్రాలు ప్రవేశించాయి.

సకాలంలో వర్షాలుపడి, సాగునీరు అందుబాటులోవుంటే కొంతమేరకు పనిదినాలు వుంటాయి. లేకపోతే వలసలే గతి. మనజిల్లాలో సెప్టెంబర్ నుండి మార్చి లోపు పనులు వుంటాయి. మిగిలిన 5 నెలలు వ్యవసాయేతర పనుల్లోకి వలసలు తప్పటంలేదు. అందువలన ఉపాధిహామీ పనితప్ప వీరికి మరోగత్యంతరం లేదు.

**ఉపాధిహామీ :** జిల్లాలో 7,11,000 జాబుకార్డులుండగా ఏప్రియల్, మే నెలల్లో 3 లక్షల మంది పనిచేస్తారు. ప్రస్తుతం 1.24 లక్షలమంది పని చేస్తున్నారు. ఇందులో పెద్దఎత్తున పాలకపార్టీ అనుయాయులు అవినీతికి పాల్పడుతున్నారు. దీన్నికూడా కూలీలకు దక్కనీయకుండా నిర్వీర్యం చేస్తున్నారు. బడ్జెట్‌లో నిధుల కేటాయింపు, కోతమూలంగా 100 రోజుల పనికూడా దక్కడం లేదు. జాబ్‌కార్డులు తీసుకున్న అందరికీ వందరోజుల పని దినాలు కల్పించాలి.

## వెనుకబడిన విద్యారంగం

మానవున్ని 'ప్రకాశ'వంతం చేసే చదువు జిల్లా ప్రజలకు చేరువ కాలేదు. ఎన్నో సార్లు అక్షరాస్యతా ఉద్యమం చేపట్టినా సంపూర్ణ అక్షరాస్యత సాధనలో వెనుకబడే ఉన్నాం. జిల్లాలో 3,085 ప్రాథమిక పాఠశాలలు, 514 ప్రాథమికోన్నత పాఠశాలలు, 799 ఉన్నత పాఠశాలలు, 121 జూనియర్ కాలేజీలు, 66 డిగ్రీ కాలేజీలు, 14ఐటిఐలు, 24ఇంజనీరింగ్ కాలేజీలు, రెండు ఓరియంటల్ కాలేజీలు, ఒకవైద్య కళాశాల, పీజిసెంటర్, న్యాయ కళాశాల ఉన్నాయి. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లోని 13జిల్లాల్లో, యూనివర్సిటీ లేని జిల్లా మనదే కావడం బాధాకరం. ఇంటర్మీడియట్ విద్య మొత్తంగా ప్రయివేటు కార్పొరేట్ సంస్థల చేతుల్లో బందీ అయ్యింది. ప్రభుత్వ, ఎయిడెడ్ కాలేజీలు పతనమయ్యాయి. పాఠశాల విద్యాలోనూ ప్రయివేటు సంస్థలు పుట్టగొడుగుల్లా ఏర్పడుతున్నాయి. విద్య ఖరీదైనదిగా మారింది. ఎల్‌కెజి విద్యార్థికే రూ.20నుంచి రూ.50వేల వరకూ ఫీజులు గుంజుతున్నారు. టెక్నో, ఒలింపియాడ్ వంటి పేర్లతో మరింత దోపిడీకి పాల్పడుతున్నారు. ఫలితంగా నిరుపేద కుటుంబాల్లోని చిన్నారులు అరకొర చదువులతోనే చాలించాల్సిన దుస్థితి ఏర్పడింది. సంక్షేమ హాస్టల్స్‌లో సౌకర్యాలు లేవు. ఉన్నత పాఠశాలల స్థాయిలో ఎస్సీ హాస్టల్స్ 117, ఎస్టీ 21, బిసి 77, కాలేజీల స్థాయిలో ఎస్టీ 3, ఎస్సీ 21, బిసి 12 ఉన్నాయి. ఈ హాస్టల్స్‌తో పాటు చదివే పాఠశాలల్లోనూ సమస్యలు తాండవిస్తున్నాయి. 60శాతం ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయాలు లేవు. ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర స్థానాలూ భర్తీ చేయడం లేదు. ఆటలు, బొమ్మలకు ప్రత్యేక ఉపాధ్యాయుల నియామకాలు నిలిపివేశారు.

- ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించి మంచి విద్య అందేలా చర్యలు తీసుకోవాలి. ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి.
- ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేయాలి.
- జిల్లాలో యూనివర్శిటీ ఏర్పాటుకు కృషి చేయాలి.
- వృత్తి, సాంకేతిక విద్యా సంస్థల్లో సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.
- చదువు పూర్తయ్యే వరకూ నిరుపేద విద్యార్థుల బాధ్యతను ప్రభుత్వమే తీసుకునేలా పథక రచన చేయాలి.
- సంపూర్ణ అక్షరాస్యత సాధనకు పూనుకోవాలి.
- ప్రతిసంక్షేమ హాస్టళ్ళకు రక్షితనీరు అందించాలి. మరుగుదొడ్ల సదుపాయం, సొంత భవనాలను ఏర్పాటు చేయాలి. మెస్ ఛార్జీలు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెంచాలి.

## ఖరీదుగా మారిన వైద్యం

జిల్లా జనాభా అవసరాలకనుగుణంగా వైద్యసౌకర్యాలు లేవు. ప్రభుత్వ వైద్యరంగం నిర్లక్ష్యానికి గురైంది. ప్రయివేట్ రంగంలో వైద్యం ఖరీదైన వస్తువుగా మారిపోయింది.

**ప్రభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రాలు:** ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలు 85, ఉపకేంద్రాలు 541, కమ్యూనిటి ఆరోగ్య కేంద్రాలు 14, ఎపి వైద్య విధాన పరిషత్ ఏరియా వైద్యశాలలు 3, టీచింగ్ హాస్పటల్ (రిమ్స్) 1, అర్బన్ హెల్త్ సెంటర్స్ 8, మాతాశిశువైద్యశాల 1 , క్షయ నివారణ 1,  మలేరియా నివారణ 1, ఇమ్యూనైజేషన్ 1, లెప్రసీ నివారణ 1, ఎయిడ్స్ నివారణ 1, ఫ్లోరైడ్ నివారణ 1, నీటి పరీక్షా కేంద్రం 1తో పాటు 104,108, ఆరోగ్య శ్రీ, వీటితో పాటుగా సాంప్రదాయ వైద్య సేవలు అందిస్తున్న ఆయుష్ వైద్య శాలలు 55 , ఎన్ఆర్‌హెచ్‌యం నిధులతో మరో 50 వైద్యశాలలు అందుబాటులో ఉన్నాయి. ఆయుష్ వైద్య కేంద్రాలలో 75శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. బ్లడ్‌బ్యాంక్స్ నాలుగు ఉన్నాయి. గ్రామాలు, పట్టణాలలో కలిపి 2900మంది ఆశా కార్యకర్తలు ఆరోగ్యసేవలు అందిస్తున్నారు. వీరికి నెలకు గౌరవవేతనం 400 రూ. మాత్రమే చెల్లిస్తున్నారు. ఆర్‌యంపి, పియంపిలు సుమారు 2000 మంది పనిచేస్తున్నారు. గతంలో వీరికి ప్రభుత్వ శిక్షణ కూడా ఇచ్చింది.

**ప్రయివేట్ వైద్యశాలలు:** జిల్లాలో 370 వరకు ఉన్నాయి. కార్పొరేట్ హాస్పటల్స్ వచ్చాయి. వైద్యం ఖరీదుగా మారిపోయింది. క్రమంగా సేవాభావం తగ్గిపోయి, వ్యాపార ధోరణులు ప్రవేశించాయి. ప్రజాధనంతో వైద్యవిద్యను అభ్యసించి ప్రజల పట్ల కనీసమైన బాధ్యతను

నిర్వహించకుండా విస్మరిస్తున్నారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీం విషయంలో ప్రభుత్వ ప్రతిపాదనను సైతం కార్పోరేట్ వైద్యశాలలు తిరస్కరించాయి. కార్పోరేట్ ఆస్పత్రిలో సాధారణ, మధ్యతరగతి ప్రజలు వైద్యం కొనలేని పరిస్థితిలో ఉన్నారు.

**ఆరోగ్యశ్రీ :** ఏప్రియల్ 2008న జిల్లాలో ప్రారంభించారు. మూడు ప్రభుత్వ వైద్యశాలలందు, 12 ప్రైవేట్ వైద్యశాలలందు సేవలు అందిస్తున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ప్రయివేట్ వైద్యశాలకు 44 కోట్లు , ప్రభుత్వ వైద్యశాలకు 12 కోట్లు అందినవి. ప్రయివేట్ వైద్యశాలకు కేటాయిస్తున్న నిధులు, ప్రభుత్వ వైద్యశాలకు అందించి అభివృద్ధి చేస్తే, ప్రజలకు మరింత మెరుగైన సేవలు చేయవచ్చు. ఆరోగ్య శ్రీ ఉద్యోగులు 114 మంది, 15 నెట్‌వర్క్ హాస్పటల్స్ మరియు పిహెచ్‌సిల నందు పనిచేస్తున్నారు. వీరికి కనీసవేతనాలు చెల్లించడంలేదు.

**రిమ్స్:** 2008 సంవత్సరం నుండి రిమ్స్ సేవలు ప్రారంభమైనవి. నిధుల కొరత, అనుమతులు ఆలస్యంగా రావడం, పాలకుల చిత్తశుద్ది కొరవడటం తదితర కారణాల వలన పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందించలేకపోతుంది. 40 రకాల క్యాడర్ పోస్టులకు గాను 250 ఖాళీగా ఉన్నాయి. రెగ్యులర్ ప్రొఫెసర్స్, అసిస్టెంట్ ప్రొపెసర్స్ పోస్టులు 40 ఖాళీగా ఉన్నాయి. వీరిలో 70 మంది కాంట్రాక్ట్ పద్దతిలో పనిచేస్తున్నారు. ప్రయివేట్ సొసైటీల ద్వారా పారిశుద్ధ్య కార్మికులు 80 మంది పనిచేయుచుండగా వీరిని ఇతర పనులకు వాడుకుంటున్నారు. కనీసవేతనాలు, ఉద్యోగభద్రత లేదు. ఫ్లోరైడ్ నివారణ కేంద్రంలో ఒక్క అధికారి మాత్రమే ఉన్నారు. 43 మండలాల్లో ఫ్లోరిన్ సమస్య తీవ్రంగా ఉంది. ఫ్లోరిన్ బెడద నుండి ప్రజలను కాపాడటం ఎలా సాధ్యం. గిరిజన ప్రాంతాలైన వైపాలెం, దోర్నాల, చీమకుర్తి మైన్స్ నందలి సిబ్బందికి మలేరియా నివారణకు అవసరమైన వాహన సదుపాయం కూడాలేదు. రిమ్స్ నందు ప్లేట్‌లెట్స్ మిషన్‌ను ఇప్పటికీ ఏర్పాటు చేయలేదు. స్వైన్‌ఫ్లూను నిర్ధారించుటకు అవసరమైన వైరాలజీ ల్యాబ్, ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంది. జిల్లా ప్రజలకు అందుబాటులోకి తేవాలి. హెచ్ఐవి, ఎయిడ్స్ రోగులకు అవసరమైన మందులు, కిట్స్ అందుబాటులో లేవు. రిమ్స్‌లో కార్డియాలజీ, నెప్రాలజీ. న్యూరాలజీ విభాగాలను తక్షణం ప్రారంభించాలి. యంఆర్ఐ స్కాన్‌ను ఏర్పాటు చేయాలి.

**ఇతర సమస్యలు :** జిల్లాకేంద్రంలోని పిపి యూనిట్ నందు ఎక్కువ ట్యూబెక్టమీ ఆపరేషన్స్‌ను జరుగుతున్నా తగినన్ని బెడ్స్ లేవు. వర్షం వస్తే బిల్డింగ్ కారుతుంది. జీవనధార మందుల షాపులు కేవలం రెండే ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా గణనీయంగా

పెంచాలి. ఫార్మా–డి , యంఫార్మసీ చదివిన వారిని డ్రగ్ ఇన్స్పెక్టర్స్‌గా నియమించి కల్తీ మందులను అరికట్టాలి. ప్రతి గ్రామంలో గ్రామ ఆరోగ్య కేంద్రాలను అవసరమైన సిబ్బందిని. నియమించి వైద్య సేవలు అందించాలి. వైద్య రంగంలో నాలుగో తరగతి ఉ ద్యోగులను నియమించాలి. వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ , ఔట్ సోర్సింగ్ విధానాన్ని తొలగించాలి. రెగ్యులర్ పద్ధతిన నియమామకాలు చేయాలి. ప్రభుత్వ ఆస్పత్రులను ప్రయివేట్ వారికి అప్పజెప్పే ప్రయత్నాలను మానుకోవాలి. ప్రతి పిహెచ్‌సిలో ఎక్స్‌రే మిషన్‌ను, పెథాలజీ టెక్నిషియన్‌ను ఏర్పాటు చేయాలి. జిల్లాలోని18 క్లస్టర్ కేంద్రాలలో మత్తు డాక్టర్లను నియమించాలి. ట్యూబెక్టమీ, ఇతర ఆపరేషన్స్‌ను మెరుగ్గా నిర్వహించాలి. రిమ్స్ నందలి ట్రామాకేర్ విభాగం నందు పనిచేయుచున్న 40 కాంట్రాక్ట్ సిబ్బందికి వేతన బకాయిలు చెల్లించాలి. ఇఎస్ఐ హాస్పటల్‌ను చీమకుర్తి, గుళ్లాపల్లి గ్రోత్‌సెంటర్‌లో ఏర్పాటు చేయాలి. ఈ పాటికే ఒంగోలు, మార్కాపురం, మార్టూరు, చీరాల హాస్పటల్స్‌ను పూర్తిగా అభివృద్ధి చేయాలి. ఒంగోలు ఆర్టీసి డిపో, రైల్వే హాస్పటల్, పోలీస్ ట్రైనింగ్ సెంటర్, జిల్లా జైలు నందలి ఆరోగ్య కేంద్రాలకు రెగ్యులర్ సిబ్బందిని నియమించి వైద్య సేవలు మెరుగుపరచాలి. అన్ని ఆరోగ్య కేంద్రాల్లోనూ యూజర్ ఛార్జీల వాత సామాన్యులకు తప్పడం లేదు. ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచిత వైద్యసేవలు అందేలా చూడాలి.

## పెరుగుతున్న పట్టణీకరణ - అసౌకర్యాలతో మగ్గుతున్న పట్టణ ప్రజలు

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం సంక్షోభంలో పడినందున ఉపాధికొరకై వ్యవసాయ కార్మిక, చేతివృత్తిదార్లు, పేదరైతాంగం పెద్ద ఎత్తున పట్టణాలకు వలసలు వస్తున్నారు. చదువు, వైద్యం, అవసరాలు మరియు వినిమయదారీ ధోరణులతో ధనిక రైతాంగం, మధ్యతరగతి కూడా పట్టణాల్లో కేంద్రీకృతమౌతున్నారు. 2001, 2011 సం।। వివరాలను పరిశీలిస్తే వ్యవసాయ రంగం నుండి పాక్షికంగా లేదా పూర్తిగా వైదొలిగి అసంఘటిత, పట్టణ చేతివృత్తుల్లోకి మారినట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఫలితంగా జిల్లాలోని పట్టణాలు, కొన్ని మండల కేంద్రాల్లో జనాభా పెరుగుతున్నది. గతంలో ఒంగోలు టౌన్, మార్కాపురం, చీరాల, కందుకూరు మున్సిపాల్టీలుండగా నేడు కొత్తగా గిద్దలూరు, అద్దంకి, కనిగిరి, చీమకుర్తిలు కూడా మున్సిపాల్టీలుగా మారాయి. ఒంగోలు కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయింది. పట్టణాల్లో జనాభా 6,62,116 వుంది. పెరుగుతున్న మధ్యతరగతి, పట్టణపేదలు, అసంఘటిత కార్మిక వర్గం ఆకాంక్షల కనుగుణంగా పాలకుల విధానాలులేవు. జిల్లాలో మున్సిపాల్టీలో అభివృద్ధి కార్యక్రమాలు, మౌళిక సదుపయాల కల్పనకు అవసరమైన నిధులను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కేటాయించడంలేదు. ఫలితంగా పట్టణాల ప్రజలు అరకొర

సౌకర్యాలతో మగ్గిపోతున్నారు. చాలినంత రక్షిత మంచినీరు అందడంలేదు. పారిశుధ్యంలేక రోగాల పాలౌతున్నారు. శివారు కాలనీల ప్రజలు రోడ్లు, సైడ్‌కాల్వలు, విద్యుత్, వీధిలైట్లు వగైరా మౌలిక సదుపాయాలు లేనందున ఇబ్బందులు పడుతున్నారు. మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడే పార్కులు, ఆడిటోరియం, గ్రంధాలయాలు, క్రీడా ప్రాంగణం, కమ్యూనిటీ భవనాలు లేవు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్ల, మందుల కొరత వుంది. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు, హాస్టల్స్, మౌళిక సదుపాయాలులేక పర్యవేక్షణ లోపాల వలన బలహీన పడిపోతున్నాయి. పేదలకు ఇండ్లస్థలాల సమస్య ప్రధాన సమస్యగా వున్నది. పౌరసేవలు ప్రైవేటీకరించి ప్రతి సేవకు యూజర్‌ఛార్జీలు విధిస్తున్నందున ప్రజలపై భారాలు పడుతున్నాయి. పట్టణ జీవితం అసౌకర్యాలు, అధిక వ్యయంతో కూడుకున్నదిగా వున్నది.

## జిల్లాను వెంటాడుతున్న ఫ్లోరిన్

మనిషి జీవించడానికి ఆహారం కన్నా ఎక్కువ ప్రాధాన్యత త్రాగునీటికి వుంది. రక్షిత మంచినీరు ప్రజలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. మనజిల్లాలో మంచినీటి సమస్య చాలా జటిలంగా వుంది. జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో 43 మండలాల్లో 729 గ్రామాల్లో మంచినీళ్ళలో ఫ్లోరిన్‌శాతం 1.2 పి.పియం మించి వుందని, హానికరమని ప్రభుత్వమే నిర్ధారించింది. కాని 5 పిపియం వరకువున్న 38 మండలాల్లో 187 గ్రామాల్లో ప్రమాదకరమైన స్థాయిలో వున్నా గత్యంతరం లేని పరిస్థితుల్లో ఫ్లోరిన్‌నీరు త్రాగి అనారోగ్యం పాలౌతున్నారు. మూత్రపిండ వ్యాధులకు గురౌతున్నారు. సంక్షేమ హాస్టల్స్, స్కూల్స్‌లో రక్షిత మంచినీరు లేనందున ఫ్లోరిన్ నీటిని విద్యార్థులు తాగుతున్నారు. ఫ్లోరిన్ నివారణకై వేలకోట్ల రూపాయలు వెచ్చించి ప్రారంభించిన రక్షిత మంచినీటి పథకాలు సగం గ్రామాలకుకూడా నీరు అందించడంలేదు. కాని కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులు పెద్ద ఎత్తున ఆర్థిక ప్రయోజనం పొందారు. ప్రజల ఆరోగ్యం పాలకులకు పట్టడంలేదు. కావున రక్షిత మంచినీటిని సాధించేందుకు ప్రజలు స్వచ్ఛందంగా కదలాలి. ఫ్లోరిన్ నివారణ కమిటీలు ఏర్పడాలి. రక్షిత మంచినీటి పథకాలు నిర్వహణ బాధ్యతను కమిటీలకు అప్పగించాలని సిపియం డిమాండ్ చేస్తుంది.

- వాననీటిని నిల్వచేసుకునేలా కృషి చేయాలి. ఎన్ఎస్‌పి నీటిని అందించాలి.
- కాల్షియం టాబ్లెట్స్‌ను, పౌష్టికాహారాన్ని బాధితులకు అందించాలి.
- బాధితులందరికీ ఉచిత వైద్యం అందేలా చూడాలి. వెయ్యి రూపాయల పింఛన్ ఇవ్వాలి.

- పాఠశాలల్లో జలమణి పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. పిల్లలకు పాలు, గుడ్లు అందించాలి.

## విద్యుత్ రంగం

అభివృద్ధికి కీలకమైన వనరు విద్యుత్. అది లేకుంటే అడుగు ముందుకు పడే పరిస్థితి లేదు. జిల్లాకు సుమారు రెండువేల మెగావాట్ల విద్యుత్ అవసరాలుఉన్నాయి. ఏటేటా అవసరం మేరకు విద్యుత్ సరఫరా జరగడం లేదు. ఐదు నుంచి పది శాతం తక్కువ విద్యుత్తునే జిల్లాకు ఎపిట్రాన్స్‌కో అందిస్తోంది. జిల్లాలో విద్యుత్ కనెక్షన్లలో ఎల్‌టి కనెక్షన్లు 10,75,669 ఉండగా, హెచ్‌టి కనెక్షన్లు కేవలం 705 మాత్రమే ఉన్నాయంటేనే, మన పారిశ్రామిక అభివృద్ధి ఏమాత్రం ఉందో అర్థమవుతుంది. 220కెవి సబ్‌స్టేషన్లు మూడు, 220 కెవి సబ్‌స్టేషన్లు నాలుగు, 132కెవి సబ్ స్టేషన్లు 15, 33కెవి సబ్‌స్టేషన్లు 238 ఉన్నాయి. త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు 15,855, సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు 9,727 ఉన్నాయి. మొత్తం గృహ సర్వీసులు 8,47,310, వాణిజ్య సర్వీసులు 74,637, పరిశ్రమలకు 9,729 సర్వీసులు ఉన్నాయి. మొత్తం వ్యవసాయ రంగ కనెక్షన్లు 1,28,590 ఉన్నాయి. జిల్లాలో అవకాశాలున్నా విద్యుత్తు ఉత్పత్తి పరిశ్రమల ఏర్పాటుపై పాలకులు ఏనాడూ శ్రద్ధ చూపలేదు. జిల్లాలో దర్శి, సూరేపల్లి, గుండ్లాపల్లి, దూపాడు, టంగుటూరుల్లో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటి నుంచి కేవలం 200మిలియన్ కిలో వాట్స్ విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. వాటికీ పభుత్వ ప్రోత్సాహం కరువైంది. కనపర్తి వద్ద జెన్‌కో పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రయత్నాలు సాగినా రైతులు వ్యతిరేకించడంతో ఆగిపోయింది. దానికి ప్రత్యామ్నాయ స్థలాలను ప్రతిపాదించినా పాలకుల చెవికెక్కలేదు. పంట భూముల్లోనే పెట్టాలన్న పట్టుదలతో అసలు పరిశ్రమనే వెనక్కు నెట్టారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తికి సుమారు ఏడు మెగావాట్ల సామర్థ్యంగల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రణాళిక అమల్లోకి రాలేదు.

- జెన్‌కో పవర్‌ప్రాజెక్టును వాన్‌పిక్ లేదా బంజరుభూములను ఎంపిక చేసి పెట్టాలి.
- వ్యవసాయ రంగానికి మరిన్ని కనెక్షన్లను కేటాయించాలి.
- 50శాతం రాయితీతో సోలార్ విద్యుత్‌ను ప్రభుత్వమే ప్రోత్సహించాలి.
- పరిశ్రమలకు అవసరమైన విద్యుత్ సరఫరా లక్ష్యాలను అందుకునేలా ప్రణాళికలు ఉండాలి.
- ప్రయివేటు రంగంలోనూ కలప, యురేనియం ఆధారిత పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి.

## పర్యావరణం

ప్రకాశం జిల్లా అభివృద్ధిలో వెనుకబడినా, పర్యావరణాన్ని నాశనం చేయడంలో మాత్రం ముందుందనే చెప్పాలి. జిల్లాలో భూగర్భజలాలు అడుగంటడం, వర్షాభావ పరిస్థితులు ఏర్పడటం, అతివృష్టితో కునారిల్లడం, తుఫాన్ల నష్టాలను చవిచూడటం వంటి ప్రకృతి వైపరీత్యాలు ఎక్కువగానే ఉన్నాయి. వాటిని నియంత్రించే శక్తిని జిల్లా కూడదీసుకోలేక పోతోంది. సముద్ర తీరాన్ని రక్షించే మడఅడవులు నేడు కనుమరుగు అవుతున్నాయి. తీరంలో ఒకప్పుడు ఏపుగా పెరిగి కనిపించే సరిగ చెట్లు నాశన మయ్యాయి. ఫలితంగా సముద్ర తీరం కోతకు గురవుతోంది. నదీ పరివాహక ప్రాంతాల్లో ఏర్పడిన పరిశ్రమలు కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. శింగరాయకొండ సమీపంలోని మన్నేరు నీటిని ఓ లిక్కర్ పరిశ్రమ వ్యర్థాలు, కాలుష్యమయం చేస్తున్నాయన్న విమర్శ ఉంది. పొగాకు, స్పిన్నింగ్ మిల్లుల వద్దా వాతావరణ పరిరక్షణ చర్యలు శూన్యం. పలకలు, గ్రానైట్ గనుల ప్రాంతాల్లో దుమ్మూ, ధూళితో ఏర్పడిన కాలుష్యం, గనుల గుంతల్లో నీరు నిల్వచేరి వ్యాప్తి చెందిన దోమలతో, వ్యాధులు ప్రబలి జనం ప్రాణాలు కోల్పోతున్నారు. నల్లమల అడవులను సైతం నాశనం చేస్తున్నారు. పట్టణాలు, మేజర్ గ్రామ పంచాయతీల్లో డంపింగ్ యార్డులు లేకపోవడంతో పరిసరాలన్నీ కాలుష్యమయం అవుతున్నాయి. ఇక పొగ, దుర్వాసనలు వెదజల్లే పరిశ్రమలెన్నో ఉన్నాయి. పర్యావరణ పరిరక్షణకు పూనుకోవడం జిల్లా ప్రజల తక్షణ కర్తవ్యంగా మారింది. పాలకులు చెట్లు నాటే కార్యక్రమాలను ఆర్భాటంగా ప్రకటించినా ఆచరణలో అడుగు ముందుకు పడటం లేదు. రోడ్ల విస్తరణపేరుతో, చెట్లను నరికివేయడంలో పాలకులే పైచేయి సాధిస్తున్నారు. రియల్ ఎస్టేట్ విస్తరణతో పంటభూములన్నీ బంజర్లుగా మారాయి. పచ్చదనం నాశనమైంది. అభివృద్ధి పేరుతో సాగే పర్యావరణ వినాశనాన్ని ఆపాల్సిన అవసరం ఉంది.

- సముద్రతీరం, నదీ పరివాహక ప్రాంతాలు, పట్టణ శివారుల్లో గ్రీన్‌బెల్ట్ ఏర్పాటుకు ప్రభుత్వం పూనుకోవాలి.
- పరిశ్రమల వద్ద చెట్లు నాటే నిబంధనలను అమలు చేసేలా యజమానులపై ఒత్తిడి తేవాలి.
- అడవుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.
- కాలుష్య కారకాలను నీటి వనరుల్లోనూ, జనావాసాల మధ్యకు వదిలే పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి. కాలుష్య నివారణా ప్రమాణాలను పాటించేలా చూడాలి.

## జిల్లా అభివృద్ధిని పట్టించుకోని పాలక పార్టీలు

జిల్లా ప్రజలారా ఇప్పుడైనా ఆలోచించండి? రాష్ట్రవిభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం అమరావతి, తుళ్ళూరు అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధిగా ప్రచారం చేస్తున్నది. వనరులను అక్కడికే సమీకరిస్తున్నది. ఇది తప్పు. శ్రీకృష్ణ కమీషన్ చెప్పినట్లు అభివృద్ధిని వికేంద్రీకరించాలి. ప్రభుత్వం ఆ విషయాన్ని విస్మరించింది. జిల్లాలో వున్న పెట్టుబడులు కూడా తుళ్ళూరు వెళుతున్నాయి. జిల్లాలో రియల్ఎస్టేట్తో పాటు అన్ని వ్యాపారాలు చతికిలబడటానికి కారణం తెలుగుదేశ ప్రభుత్వ విధానాలే.

## మౌనం వీడండి - కలిసికట్టుగా కదలండి

జిల్లా అభివృద్ధి కావడానికి, ప్రభుత్వ విధానాలకు, రాజకీయాలకు విడదీయరాని సంబంధం వుంది. తమ స్వార్థం కోసం, పదవులకోసం, సంపదకోసం, వనరులను కొల్లగొట్టడం కోసం, రాజకీయాలను ఒక ముసుగుగా వాడు కుంటున్నాయి అధికార, ప్రతిపక్ష పార్టీలు. అందుకే ప్రజలు ఈ వాస్తవాలను గుర్తించాలి. జిల్లాను అభివృద్ధి చేస్తే కాని ప్రజల జీవితాలు మారవు. నిరంతరం ప్రజల సమస్యలపై పోరాడుతున్న వామపక్షాలను ఆదరించండి. మౌనం వీడండి, గొంతు కలపండి. జిల్లా అభివృద్ధి లక్ష్య సాధనకై చేయూతనివ్వండి.

జిల్లా సమగ్రాభివృద్ధికై ఉద్యమిద్దాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి రావల్సిన నిధులను రాబడదాం! రండి!! కదలండి!!! కలసికట్టుగా పోరాడదాం!!!!

## కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వాలు జిల్లా అభివృద్ధికి చేయాల్సినవి

1) రామాయపట్నం పోర్టునిర్మాణం.
2) నడికుడి - శ్రీకాళహస్తి , దొనకొండ - ఒంగోలు రైల్వే లైన్లు.
3) వెలుగొండ, ఇతర ప్రాజెక్టులు సంవత్సర కాలంలో పూర్తి.
4) వాన్పిక్ భూములు ప్రభుత్వం స్వాధీనం కావాలి. టెక్స్టైల్స్ పరిశ్రమలతో పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పడాలి.
5) దొనకొండను పారిశ్రామిక క్లష్టర్గా ప్రకటించి భూములు కేటాయించాలి.
6) మైనింగ్ రంగానికి జాతీయ ఉత్పత్తి జోన్గా కనిగిరిని ప్రకటించాలి. ప్రభుత్వరంగంలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని నిర్మించాలి.
7) చీమకుర్తిలో మైనింగ్ యూనివర్శిటీని స్థాపించాలి.
8) మౌలిక సదుపాయాలు (రోడ్లు, రవాణా, విద్యుత్, నీరు) అభివృద్ధికి ప్రభుత్వం పెట్టుబడులు వెయ్యికోట్లు పెట్టాలి.

9) దళితులు, గిరిజనుల విద్యాభివృద్ధికోసం అన్ని మండలాల్లో గురుకుల పాఠశాలలు తక్షణం ప్రారంభించాలి.

10) సాగుకు వీలైన ప్రభుత్వ బంజర్లును పేదలకు పంచాలి.

**1) అభివృద్ధికి ఆమడదూరంలో జిల్లా ప్రజలు :** పంటల ధరలు పడిపోవడం, కరువు కాటకాలు రైతాంగాన్ని కుంగదీశాయి. కొనుగోలు శక్తి దారుణంగా పడిపోయింది. జిల్లాలో నూటికి 70% కుటుంబాలకు మరుగు దొడ్డి సౌకర్యం లేదు. 38% కుటుంబాలకు స్నానపుగదులులేవు. 62% కుటుంబాలకు కట్టెపుల్లలే వంటకు ఆధారం. 54% కుటుంబాలకు 1 గది ఇల్లు మాత్రమే. ఇళ్ళు లేనివారు కూడా పెద్ద సంఖ్యలోనే వున్నారు. భూమిలేని వారు 50% కుటుంబాలు. అతి తక్కువ ఆదాయంతో 70%మంది ప్రజలు జీవిస్తున్నారు.

**2) వ్యవసాయం :** జిల్లాలోని 19.5 లక్షల ఎకరాల భూమిలో కేవలం14 లక్షల ఎకరాలు సాగవుతుంది. నీటివనరులు అందుతున్న భూమి 3 లక్షల ఎకరాలు మాత్రమే. 80% భూమి వర్షాదారంమీద ఆధారపడి వుంది. గ్లోబలైజేషన్ మూలంగా వ్యాపార పంటలకు ధరలు లేక వ్యవసాయం ఒడిదుడుకులకి లోనవుతుంది. రైతులు అప్పులపాలవుతున్నారు. ఆత్మహత్యలు రాష్ట్రంలో తొలుత ప్రారంభమైంది ఈ జిల్లాలోనే.

**3) వనరులు వున్నా ప్రజల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిన పాలకపార్టీలు :** శింగరాయకొండ, కొణిజేడు, వై.పాలెం, ఒంగోలు, అద్దంకి కొండల్లో ఇనుప ఖనిజం 295 మిలియన్ టన్నులు వుంటుందని,చుండి, వలేటివారిపాలెం కొండల్లో గ్రానైట్ ఖనిజం 319 మిలియన్ టన్నులు వుంటుందని అంచనా. రిజర్వు ఫారెస్టు ఏరియాలో బైరేటీస్ 71 వేల మెట్రిక్ టన్నులు, మాంగనీసు 1 లక్షా 35 వేల టన్నులు కనిగిరి కొండల్లో యురేనియం, చీరాల, చిన్నగంజాంలలో సిలికాన్ శాండ్, చైనాక్లే లభిస్తాయని అంచనాలు. పొగాకు ఉత్పత్తులు, పాలు, పండ్లతోటలు అధికంగా ఉత్పత్తి అవుతున్నవి. ఈ వనరులు వెలికితీసి పరిశ్రమలు పెట్టడానికి పాలకపార్టీలైన తెలుగుదేశం, కాంగ్రెస్ ప్రభుత్వాలు కనీస శ్రద్ధకూడా పెట్టలేదు. అభివృద్ధి అంటే ప్రజల అభివృద్ధి తప్ప కొన్ని భవనాలు, కొందరి సంపద కాదు.

**ప్రాజెక్టులు – నీరు :** జిల్లాలో 6 ప్రాజెక్టులు ప్రారంభించారు. పూర్తికాలేదు. వెలిగొండ ప్రాజెక్టు, పూర్తయితే 5 లక్షల 75 వేల ఎకరాలకు సాగునీరందుతుంది. ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదు. ఈ సం॥ 1500 కోట్లు అవసరం. కానీ 153 కోట్లు మాత్రమే కేటాయించింది. చంద్రబాబే టన్నెల్‌ను సందర్శించినా పనులు ఆగిపోయి వున్నాయి. ప్రాజెక్టులు సం॥ కాలంలో పూర్తి, వ్యవసాయరంగాభివృద్ధికి ప్రభుత్వ పెట్టుబడులు పెంచాలి.

**4) పారిశ్రామిక రంగం :** జిల్లాలో ఒక్కటికూడా భారీ పరిశ్రమలేదు. 5 లక్షల మంది కార్మికులున్నారు. జిల్లాలో చిన్న చిన్న పరిశ్రమలు 6,879. వీటిలో 71,000 మంది కార్మికులకు మాత్రమే చాలీ చాలని ఉపాధి దొరుకుతుంది. ప్రభుత్వ పెట్టుబడులు భారీ పరిశ్రమలకు వస్తేనే అనుబంధంగా ప్రైవేట్ రంగంలో పరిశ్రమలు వస్తాయి. చిన్నచిన్న పరిశ్రమలతోపాటు పెద్ద పరిశ్రమలు రావాలి.

**5) అధోగతిలో విద్యారంగం :** ఏ ప్రాంతమైనా అభివృద్ధి కావాలంటే విద్యాభివృద్ధి చాలా ముఖ్యం. జిల్లాలో 34 లక్షల మంది వుంటే సంతకం మాత్రమే పెట్టగలిగిన వారిని కూడా లెక్కిస్తే 19 లక్షలు. 15 లక్షల మంది అక్షరాస్యతకు దూరంగా వున్నారు. రాష్ట్రంలో దళితులు అత్యధిక శాతం ఉన్న జిల్లా. కానీ విద్యలో దళితులు, గిరిజనులు బాగా వెనుకబడి వున్నారు. వీరికోసం ప్రతిష్ఠగలిగిన విద్యా సంస్థ ఒక్కటి కూడా లేదు. ప్రత్యేకంగా గురుకుల పాఠశాలలు వీరికొరకు ప్రారంభించాలి. స్వాతంత్ర్యం వచ్చి 68 సం॥ గడిచినా ఒక్క యూనివర్శిటీ కూడా ఏర్పాటు చేయలేకపోయారు. ప్రస్తుత విద్యాభివృద్ధి పరిస్థితి దారుణంగా వుంది. కార్పొరేట్ సంస్థలు ప్రాథమిక విద్య వరకు ప్రవేశించి ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేస్తున్నాయి. అధిక ఫీజుల దోపిడితో పేదలు విద్యకు దూరమవుతున్నారు. దళిత, గిరిజన తరగతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లా లో ప్రభుత్వరంగంలో మైనింగ్ యూనివర్శిటీని ఏర్పాటు చేయాలి.

**6) ఉద్యమిద్దాం - జిల్లా అభివృద్ధిని సాధిద్దాం :** ప్రజల అభివృద్ధే జిల్లా అభివృద్ధికి మూలం. కొన్ని ప్రాంతాల అభివృద్ధి సమాగ్రాభివృద్ధి కాదు. వికేంద్రీకరణ ద్వారా సాగే అభివృద్ధే సమగ్రాబివృద్ధి. సరళీకరణ విధానాల వలన కేంద్రీకరణ అభివృద్ధి అసమాన అభివృద్ధికి దారితీస్తుంది. ప్రాంతాల మధ్య అంతరాలను పెంచుతోంది. అందువల్లే మనజిల్లా వెనుకబడింది. ప్రస్తుతం రాష్ట్ర అభివృద్ధి అంటే రాజధాని అభివృద్ధిగా తెలుగుదేశం ప్రభుత్వం ప్రకటిస్తోంది. గతంలో అభివృద్ధి అంటే హైదరాబాద్ అభివృద్ధేనని తెలుగుదేశం వ్యవహరించింది. ఇప్పుడు మళ్లీ అదే విధానాలు చేపట్టింది. మన జిల్లాలో రియల్ఎస్టేట్ వ్యాపారం నుండి అన్ని వ్యాపారాలు చతికిలబడటానికి కారణం తెలుగుదేశం ప్రభుత్వ విధానాలే. అభివృద్ధికి కేంద్ర బిందువు ప్రజలవ్వాలి. వికేంద్రీకరణ తోనే ఇది సాధ్యం. శ్రీకృష్ణ కమీషన్ కూడా ఈ విషయం చెప్పింది. అందుకే అందరం ఉద్యమిద్దాం. జిల్లా అభివృద్ధి ని సాధిద్దాం కదలండి, మద్దతివ్వండని అర్థిస్తున్నాం. ఆగష్టు 1–3వరకు జరిగే ప్రచారాందోళనల్లోనూ, 14న జరిగే ధర్నాలోనూ పాల్గొనాల్సిందిగా ఆహ్వానిస్తున్నాం.

**కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వాలు జిల్లా అభివృద్ధికి చేయాల్సినవి**

1) రామాయపట్నం పోర్టునిర్మాణం.
2) నడికుడి – శ్రీకాళహస్తి , దొనకొండ – ఒంగోలు రైల్వే లైన్లు.
3) వెలుగొండ, ఇతర ప్రాజెక్టులు సంవత్సర కాలంలో పూర్తి.
4) వాన్‌పిక్ భూములు ప్రభుత్వం స్వాధీనం కావాలి. టెక్స్‌టైల్స్ పరిశ్రమలతో పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పడాలి.
5) దొనకొండను పారిశ్రామిక క్లస్టర్‌గా ప్రకటించి భూములు కేటాయించాలి.
6) మైనింగ్ రంగానికి జాతీయ ఉత్పత్తి జోన్‌గా కనిగిరిని ప్రకటించాలి. ప్రభుత్వరంగంలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని నిర్మించాలి.
7) చీమకుర్తిలో మైనింగ్ యూనివర్శిటీని స్థాపించాలి.
8) మౌలిక సదుపాయాలు (రోడ్లు, రవాణా, విద్యుత్, నీరు) అభివృద్ధికి ప్రభుత్వం పెట్టుబడులు వెయ్యికోట్లు పెట్టాలి.
9) దళితులు, గిరిజనుల విద్యాభివృద్ధికోసం అన్ని మండలాల్లో గురుకుల పాఠశాలలు తక్షణం ప్రారంభించాలి.
10) సాగుకు వీలైన ప్రభుత్వ బంజర్లును పేదలకు పంచాలి.

# భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు),
## ప్రకాశంజిల్లా కమిటి.